ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు 5
జిల్లా వార్తలు
శుక్రవారం 23 మే 2025



కార్యకర్తలకు అండగా టీడీపీ



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



టీడీపీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

- నామినేటెడ్ పదవుల్లో వారికే ప్రాధాన్యం
- చంద్రబాబు, లోకేశ్ స్ఫూర్తితో పార్టీ బలోపేతం
- కందనవోలు ప్రగతి కోసం సమష్టిగా శ్రమిద్దాం
- జిల్లా మహానాడులో టీడీపీ నేతల వెల్లడి

కర్నూలు/కర్నూలు అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మహోన్నత ఆశయంలో తెలుగుదేశం పార్టీని స్థాపించిన తరువాతే రాష్ట్రంలో రాజకీయ చైతన్యం వచ్చింది. బీసీలు, ఎస్సీ ఎస్టీలు, మైనార్టీలు చట్టసభల్లో అడుగు పెట్టారు. గెలుపు సైనికులు కార్యకర్తలకు ఎల్లవేళల టీడీపీ అండగా ఉంటుంది.. నామినేటెడ్ పదవులు పంపకాల్లోనూ, రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు సముచిత న్యాయం జరుగుతుందని కర్నూలు జిల్లా మహానాడు వేదికగా టీడీపీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతనిధులు పేర్కొన్నారు. కడపలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న మహానాడుకు టీడీపీ శ్రేణులను సమాయత్తం చేయడం, జిల్లాలో చేపట్టాల్సి అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానాలు చేయడం కోసం గురువారం స్థానిక కమ్మ సంఘం కల్యాణ మండపంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి అధ్యక్షతన జిల్లా మహానాడు సభ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సభా ప్రాంగణమంతా జనంతో నిండిపోయింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ రాజకీయ శూన్యతలో రాష్ట్రం ఉన్న సమయంలో ఎన్టీఆర్ బలహీనవర్గాల పునాదులపై టీడీపీ స్థాపించారన్నారు. ఆ మహనీయుడి ఆశయ సాధనకు సీఎం చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ శ్రమిస్తున్నారని అన్నారు. ఎంపీటీసీగా ఉన్న తనను ఎంపీగా చేసి పార్లమెంట్‌కు పంపిన ఘనత టీడీపీదే అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రక్షణ చట్టం సాధించుకుందామని పిలుపునిచ్చారు. టీడీపీ అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పార్టీ కోసం పని చేసిన ఎందరికో రాష్ట్ర, జిల్లా నామినేటెడ్ పదవులు వచ్చాయని, మిగిలిన కార్యకర్తలకు కూడా న్యాయం జరుగుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జిల్లాకు వచ్చిన అధినేత చంద్రబాబు, పాదయాత్రలో యువనేత నారా లోకేశ్ ఇచ్చిన హామీలు అమలకు పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నారని గుర్తు చేశారు. జిల్లాల్లో ప్రాజెక్టులు నిర్మాణాలు, పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. తన నాయకత్వంలో జిల్లాలో టీడీపీ ఘన విజయం అందుకోవడం, జిల్లా మహానాడుకు నాయకత్వం వహించడం మరవలేని జ్ఞాపకమన్నారు. కడపలో జరగబోయే మహానాడుకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు తరలి వెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, ఏపీ వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఏపీ కురవ/కురబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, ఏపీ టూరిజం డైరెక్టర్, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు ముంతాజ్‌బేగం, కమ్మ సంఘం నాయకుడు రాజశేఖర్ తదితరులు ప్రసంగించారు. అంతకు ముందు టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగుదేశం జెండాను ఎగురవేశారు. వివిధ కారణాలతో మృతి చెందిన టీడీపీ శ్రేణులు, పాకిస్థాన్ ప్రేరేపిత తీవ్రవాదుల దాడుల్లో ప్రాణాలు వీడిన పహల్గాం మృతులు, యుద్ధంలో అమరులైన భారత జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకేపోగు ప్రభాకర్, మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





ప్రసంగిస్తున్న బస్తిపాటి నాగరాజు, తిక్కారెడ్డి



జగన్‌ది రివర్స్ పాలన



వైసీపీ హయాంలో జగన్ రివర్స్ టెండర్స్ పేరిట రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు. నాటి తెలంగాణ సీఎం కేసీఆర్‌కు సన్మానాలు చేసి రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టు రాకుండా మోసం చేశారు. గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, హంద్రీనీవా పత్తికొండ జలాశయం కోసం తీర్మానం చేస్తున్నాం. జగన్ సొంత జిల్లాలో 5లక్షల మందితో మహానాడు ఘనంగా నిర్వహించబోతున్నాం.

– బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మిగనూరు

దళిత సోదరుల్లారా మేల్కోండి



కోడుమూరు అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడుతాను. అధినేత చంద్రబాబు ప్రోత్సాహం, విష్ణు అన్న సహకారంతో ఎమ్మెల్యేగా గెలిచాను. మా అమ్మ సర్పంచ్‌గా.. నేను ఎమ్మెల్యేగా ఉండే ఈగడ్డపై జిల్లా మహానాడు జరగడం అదృష్టంగా భావిస్తున్నా. గుండ్రేవుల జలాశయం నిర్మిస్తే ఈప్రాంతం సస్యశ్యామలం అవుతుంది. నాడు టీడీపీ ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విదేశీ విద్యా పథకం పెడితే.. జగన్ వచ్చాక అంబేద్కర్ పేరు తొలగించిన జగన్ పేరు పెట్టుకున్నారు. దళిత సోదరులారా ఇప్పటికైనా మేల్కోండి.

– దస్తగిరి, ఎమ్మెల్యే, కోడుమూరు

కార్యకర్తలకు న్యాయం చేస్తాం



టీడీపీని నమ్ముకున్న కార్యకర్తలకు తప్పక న్యాయం జరుగుతుంది. పార్టీ మనకేమి ఇచ్చిందని కాదు.. పార్టీకి మనమేమి చేశామని ఆలోచించాలి. ప్రతి ఒక్కరికి పదవులు కావాలంటే కొంత సమయం పడుతుంది. పత్తికొండ నియోజకవర్గంలో ప్రతి పల్లెకు హంద్రీనీవా నీళ్ల ఇవ్వాలని నాడు డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి రూ.128 కోట్లతో చెరువులు నింపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో ప్రతి చెరువుకు హంద్రీనీవా ద్వారా చెరువులు నింపే బాధ్యత నాది.

– కేఈ శ్యాంబాబు, ఎమ్మెల్యే, పత్తికొండ

చిన్న పరిశ్రమలు, లిఫ్టులు నిర్మించాలి



మంత్రాలయం అంటే గుర్తుకొచ్చేది కరువు, వలసలు. వీటి నిర్మూలనకు ఎత్తిపోతల పథకాలు, చిన్న తరహా పరిశ్రమలు నిర్మించాలి. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి, ఉద్యోగాలు కల్పించాలి. ఏడాదిలో ఆరు నెలలే పనులు ఉంటాయి. మిగిలిన సమయంలో ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి.

– ఎన్.రాఘవేంద్రరెడ్డి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి

కష్టపడే వారికి గుర్తింపు



టీడీపీ గెలుపు గుర్రాలు కార్యకర్తలే. పని చేసే కార్యకర్తలు, నాయకులను అధిష్ఠానం గుర్తిస్తుంది. కష్టపడిన వారందరికి ఏదో ఒక పదవి రావాలని కోరుకుంటున్నాను. అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్ ఆదేశాల మేరకు పార్టీని బలోపేతం చేద్దాం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ ప్రభంజనం సృష్టిద్దాం.

– సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కుడా చైర్మన్

● జనబలం ఉన్నవారికే పదవులు



టీడీపీకి కార్యకర్తలే బలం. గ్రామాల్లో కనీసం సర్పంచ్‌ను గెలిపించుకునే జనబలం కలిగిన నాయకులకే నామినేటెడ్ పదవులు ఇవ్వాలి. కార్యకర్తలకు అండగా నిలిచే నాయకులకు చేయుత ఇవ్వాలి. కోడుమూరు నియోజకవర్గంలో అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తాను. కోడుమూరు పట్టణానికి గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా పైపులైన్ వేసి తాగునీరు ఇస్తే శాశ్వతంగా చంద్రబాబును, టీడీపీని గుండెల్లో పెట్టుకుంటారు.

– డి. విష్ణువర్ధన్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాణాలొడ్డి కూటమి అభ్యర్థులను గెలిపించుకున్నాం. రాబోయే స్థానిక ఎన్నికల్లో సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీగా టీడీపీ అభ్యర్థులను గెలిపించి అన్ని పదవుల్లో పసుపు జెండా ఎగురవేయాలి. పదవులు ఇచ్చినా ఇవ్వకపోయినా ఎన్టీఆర్ స్ఫూర్తి, చంద్రబాబు ఆశయాల సాధనకు సామాన్య కార్యకర్తగా పని చేద్దాం. నిజమైన కార్యకర్తే టీడీపీ అసలైన నాయకుడు. తనకు ఎన్నో అవకాశాలు చేజారిపోయినా పార్టీ కోసం ఓ కార్యకర్తలా కృషి చేశాను.

– కె. మీనాక్షినాయుడు, మాజీ ఎమ్మెల్యే, ఆదోని టీడీపీ ఇన్‌చార్జి

కడప జనసంద్రం కావాలి



మహానాడు జన సమీకరణ కమిటీలో నేను సభ్యుడిని. రాయలసీమలో జరుగుతున్న ఈ సభను దిగ్విజయం చేద్దాం. గత ఎన్నికల్లో టీడీపీ శ్రేణులు సమష్టి కృషితోనే అఖండ విజయం అందుకున్నాం. ఆ స్ఫూర్తితో వెల్లువలా మహానాడుకు తరలిరావాలి. కడప గడప జనసంద్రం కావాలి. జగన్ గుండెల్లో దడ పుట్టాలి.

గౌరు వెంకటరెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి

వేదవతి నిర్మిస్తే ఆలూరు సస్యశ్యామలం



ఆలూరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలని గతంలోనే సీఎం చంద్రబాబు నిధులు ఇచ్చి శంకుస్థాపన చేశారు. వైసీపీ అటకెక్కించారు. ఆ ప్రాజెక్టు పూర్తి చేస్తే సాగు, తాగునీరు అందుతుంది. జగన్ విద్యుత్ కొనుగోళ్ల పేరిట భారీ దోపిడి చేశారు. 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారు.

– బి.వీరభద్రగౌడ్, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

చెరువుల మరమ్మతుకు ఆదేశం

● కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న చెరువుల మరమ్మతు, నీటి పారుదల వ్యవస్థల పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ రంజిత్ బాషా జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వాటర్ బాడీస్‌కు సంబంధించిన రిపేర్, రెనోవేషన్ రెస్టోరేషన్ (ఆర్ఆర్ఆర్) స్కీం జిల్లా స్థాయి ఇంప్లిమెంటేషన్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్ స్కీం ద్వారా కేంద్రం నుంచి 60 శాతం, రాష్ట్రం నుంచి 40 శాతం నిధులతో ఈ పనులు చేపడతామని అన్నారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఎంఈ వర్క్స్ డివిజన్ ఈఈ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, గ్రౌండ్ వాటర్ డీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



హంపలో రథాన్ని లాగుతున్న దృశ్యం

జై హనుమాన్

- ఘనంగా హనుమాన్ జయంతి
- మద్దికెరలో రథోత్సవం

మద్దికెర, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా జరిగాయి. ఆలయాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు. కాగా మద్దికెర మండలంలోని హంప గ్రామంలో హనుమజ్జయంతి సందర్భంగా రథోత్సవం కోలాహలంగా సాగింది. ఈ రథోత్సవానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ముందుగా స్వామివారి ఆలయంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ ఆరాధన, రథ ప్రోక్షణ చేశారు. అనంతరం రథం ఎదుట హోమం పూజలు చేశారు. అనంతరం రథాన్ని గ్రామ పురవీధుల్లో లాగుతూ భక్తులు తమ భక్తిప్రపత్తిని చాటుకున్నారు.

ఎమ్మిగనూరుటౌన్ : ఎమ్మిగనూరు పట్టణంలో హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్రను నిర్వహించారు. పట్టణంలోని సోగనూరు రోడ్డు వజ్ర అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి భారీ విగ్రహంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ నీలకంఠేశ్వర దేవాలయం, శ్రీనివాస సర్కిల్, ట్యాంక్ బండ్ రోడ్డు, సోమప్ప సర్కిల్ మీదుగా సాగింది.



సోగనూరు రోడ్డు సమీపంలోని వజ్ర అభయ ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర ఏర్పాటు చేసిన భారీ విగ్రహం

నగర పాలకలో బదిలీలు

కర్నూలు న్యూసిటీ, మే 22(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిసెంట్లను ఇతర విభాగాలకు బదిలీ చేస్తూ కమిషనర్ ఎస్. రవీంద్రబాబు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఎస్.తిప్పన్న జూనియర్ అసిస్టెంట్‌ను పట్టణ ప్రణాళిక విభాగం, టి.శ్రీనివాసులు జూనియర్ అసిస్టెంట్‌ను రెవెన్యూ సెక్షన్, ఎం.రాజు సీనియర్ అసిస్టెంట్‌ను రెవెన్యూ సెక్షన్, జి.సుహెల్ అహ్మద్ జూనియర్ అసిస్టెంట్ ఇంజనీరింగ్ సెక్షన్, ఎస్.మన్సూర్ బాషాను పట్టణ ప్రణాళికా విభాగం, ఎ. సుధాగ్రేస్ జూనియర్ అసిస్టెంట్‌ను పట్టణ ప్రణాళికా విభాగం, ఎస్.ఇస్మాయిల్ జూనియర్ అసిస్టెంట్‌ను ఇంజనీరింగ్ సెక్షన్, డి.నరసింహయ్య జూనియర్ అసిస్టెంట్‌ను పబ్లిక్ హెల్త్ సెక్షన్, ఎం.శివశంకర్ జూనియర్ అసిస్టెంట్‌ను పబ్లిక్ హెల్త్ సెక్షన్, ఎం.అబ్దుల్ రసూల్ జూనియర్ అసిస్టెంట్‌ను యూపీఏ సెక్షన్, ఆర్.రాజు జూనియర్ అసిస్టెంట్‌కు అదే సెక్షన్‌లో ఏ3 క్లర్క్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

- క్యాంపెయిన్‌ను విజయవంతంగా నిర్వహించాలి
- ప్రతి రోజు యోగా కార్యక్రమాలు చేపట్టాలి
- కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ పి రంజిత్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి యోగాంధ్ర క్యాంపెయిన్ అంశంపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్ర క్యాంపెయిన్ విజయవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి రోజు యోగాకి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

జూన్ 17న ఐదు వేల మందితో..

రాష్ట్ర ప్రభుత్వం జూన్ 22 వరకు ప్రతి రోజు ఒక జిల్లాలో ఒక థీమ్‌తో స్టేట్ ఈవెంటు యోగా సెషన్‌ను నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. అందులో భాగంగా జూన్ 17న కర్నూలు జిల్లాలో ఐదు వేల మంది పారిశుధ్య కార్మికులతో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లుచే యాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జూన్ 8న కర్నూలు, ఆదోని, పత్తికొండ డివిజన్లలోని మూడు ప్రదేశాల్లో సీనియర్ సిటిజన్లతో యోగా నిర్వహించాలని, అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీవోలను ఆదేశించారు. కొండారెడ్డి బురుజు వద్ద, ఓర్వకల్లు రాక్‌గార్డెన్, నగరవనం, మంత్రాలయంలో మే 30, జూన్ 5, జూన్ 12, జూన్ 18వ తేదీల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మే 26 నుంచి 30వ తేదీ వరకు..

ప్రతి గ్రామంలో మే 26 నుంచి మే 30వ తేదీ వరకు ప్రతి గ్రామంలో వివిధ రకాల యోగా పోటీలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు మండల స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. జూన్ 9 నుంచి 14వ తేదీ వరకు జిల్లా స్థాయిలో పోటీలు డీఈవో, డీఎస్‌డీవోలు నిర్వహిస్తారన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన ఉత్తమ జట్లు రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తాయన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ప్రతి కేటగిరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. వీసీలో జేసీ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, కర్నూలు, పత్తికొండ ఆర్డీవోలు సందీప్‌కుమార్, భరత్, అన్ని మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.



వంద శాతం వారికే..

రైతులు, పొదుపు మహిళలు, దివ్యాంగులకు చోటు

- ఒత్తిళ్లు, సిఫారసులకు అవకాశం లేనట్టే
- ఊపిరి పీల్చుకుంటున్న అధికారులు, సిబ్బంది
- రూ.6కోట్ల విస్తరణ పనులు
- సకాలంలో పూర్తి చేయాలని ఆదేశం
- పని కోల్పోయిన వారికి నష్టపరిహారం మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

సి.క్యాంపు రైతు బజార్‌లో ఇక నుంచి ఎవరు పడితే వారు అమ్మకాలు జరిపే అవకాశముండదు. నిజమైన రైతులు, పొదుపు లక్ష్మి మహిళలు, దివ్యాంగులు మాత్రమే వ్యాపారాలు కొనసాగిస్తారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లు, సిఫారసులు ఇక చెల్లవు. దీంతో రైతు బజారు అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకుంటున్నారు. ఏది ఏమైనా సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన అనంతరం సి.క్యాంపు రైతుబజారుకు మహర్దశ పట్టిందని చెప్పవచ్చు. ఓ వైపు విస్తరణ పనులు.. మరో వైపు రైతులకే ప్రాధాన్యంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రూ.6కోట్లు మంజూరు చేస్తూ విస్తరణ పనులు లక్ష్యం మేరకు సకాలంలో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. దీంతో అధికారులు రైతుబజార్ పక్కనున్న శిథిలావస్థలో ఉన్న పది బిల్డింగ్‌లను కూల్చివేశారు. చకచకా పనులు చేపడుతున్నారు. రాష్ట్రంలోనే సి. క్యాంపు రైతుబజార్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

కర్నూలు అగ్రికల్చర్, మే 22 (ఆంధ్రజ్యోతి): రైతుబజారులో నూరు శాతం రైతులు, పొదుపు లక్ష్మి గ్రూపుల మహిళలు దివ్యాంగులకే కూరగాయలు, పండ్లు అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు రైతుబజారు అధికారులు, సిబ్బంది తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి రాజకీయ నాయకుల ఒత్తిళ్లు, సిఫారసులకు ఇక ఛాన్స్ లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఈనెల 17న 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'లో భాగంగా సి.క్యాంపు రైతుబజారులో పర్యటించారు. రూ.6కోట్లు మంజూరు చేస్తూ విస్తరణ పనులు లక్ష్యం మేరకు సకాలంలో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

పది బిల్డింగ్‌లను కూల్చివేయడంతో పాటు..

రెండు రోజుల క్రితం సి.క్యాంపు రైతుబజారు పక్కనే ఉన్న శిథిలావస్థకు చేరిన 10బిల్డింగ్‌లను కూల్చివేయడంతో పాటు ప్లాట్‌ఫారాలు, ప్రహరీ తదితర పనులన్నీ పూర్తిచేసేందుకు ఎస్టిమేట్లు తయారుచేసి మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఆమోదానికి పంపారు. ఈ విషయాన్ని బుధవారం మార్కెటింగ్ శాఖ డీఈ రఘునాథ రెడ్డి తెలిపారు. మరోవైపు సీఎం పర్యటన సందర్భంగా మరమ్మతుల పనులు పూర్తిచేసేందుకు అని సి. క్యాంపు రైతుబజారులో కూరగాయలు అమ్ముకుంటున్న రైతులు, పొదుపులక్ష్మి మహిళలకు రెండు రోజులు తాత్కాలిక విరామాన్ని ప్రకటించారు. రెండు రోజులు ఉపాధి కోల్పోయిన వారికి నష్టపరిహారాన్ని అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, హరీష్ కుమార్ తెలిపారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు అందుబాటులో తెస్తాం...

రైతుబజారులో చేపట్టాల్సిన పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తెస్తామని డీఈ రఘునాథరెడ్డి తెలిపారు. విస్తరణ తర్వాత ఇక ఎటువంటి రద్దీ ఉండదని, ఇంకా చాలామంది రైతులకు, పొదుపులక్ష్మి గ్రూపుల మహిళలకు వితంతువులకు, కూరగాయలు అమ్ముకునేందుకు అవకాశం కల్పించబడుతుందన్నారు. సీ.క్యాంపు రైతుబజారు విస్తరణతో పాటు తొందరలోనే కల్లూరులోని గోవర్ధనగిరి రైతుబజారున ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు తాము పండించిన కూరగాయలు, పండ్లను దళారులతో అమ్మి నష్టపోకుండా ఆయా గ్రామాలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తున్నా మని, రైతుబజార్లలోనే పంట ఉత్పత్తులు అమ్ముకుంటే మంచి ధర లభిస్తుందని హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ తెలిపారు.

మా జీవితాల్లో వెలుగు



సి. క్యాంపు రైతుబజారు మా జీవితాల్లో వెలుగు నింపింది. ఎప్పటి నుంచో ఇక్కడ పొలంలో పండించిన కూరగాయలు, మామిడి, జామ తదితర పండ్లను తీసుకువచ్చి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాం. రైతుబజారును విస్తరిస్తే మరింత మందికి జీవనోపాధి లభిస్తుంది.

గోపాల్, రైతు, నాయకల్లు

ఒత్తిళ్లు తగ్గిపోయాయి



సీఎం చంద్రబాబు రైతుబజారుకు వచ్చి వెళ్లిన తర్వాత నిజమైన రైతులు, పొదుపులక్ష్మి గ్రూపుల మహిళలు, వితంతువులు, దివ్యాంగులకు మాత్రమే కూరగాయలు, పండ్లు అమ్ముకునే అవకాశం దక్కింది. గతంలో మాదిరిగా రాజకీయ నాయకులు మాపై ఒత్తిళ్లు, సిపారసులు చేయడం లేదు.

కళ్యాణమ్మ, ఎస్టేట్ అధికారి,
సి.క్యాంపు రైతుబజార్

ఉత్తమ రైతుబజార్‌గా తీర్చిదిద్దే అవకాశం



రాష్ట్రంలోనే ఉత్తమ రైతుబజార్‌గా సి. క్యాంపు రైతుబజారును తీర్చిదిద్దే అవకాశం ఏర్పడింది. గ్రామాలకు వెళ్లి కూరగాయలు, పండ్లు పండిస్తున్న రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కల్లూరులో గోవర్ధనగిరి రైతుబజారు కూడా త్వరలోనే అందుబాటులోకి రానుంది.

- శివకుమార్,
హార్టికల్చర్ అసిస్టెంట్





జస్టిస్ ఏ. హరిహరనాథశర్మను సన్మానిస్తున్న డాక్టర్ వంకి పెంచలయ్య, ప్రిన్సిపాల్ తదితరులు

చట్టాలపై అవగాహనతో న్యాయవాద వృత్తిలో రాణింపు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.హరిహరనాథ శర్మ

కర్నూలు లీగల్, మే 22 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద వృత్తిలో రాణించాలంటే చట్టాలపై అవగాహనతోనే సాధ్యమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ. హరిహరనాథ శర్మ తెలిపారు. కెరీర్ ప్రాస్పెక్ట్ ఇన్ లా అనే అంశంపై స్థానిక ప్రసూన న్యాయ కళాశాలలో గురువారం జరిగిన ఓ సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. లా విద్యార్థులు తమ లా కోర్సు సమయంలోనే వివిధ చట్టాలను కష్టపడి నేర్చుకోవాలని, ఆ పరిజ్ఞానంతోనే వారు కోర్టులలో సమర్థవంతంగా వాదించగలరని అన్నారు. సమాజంలో న్యాయవాద వృత్తికి ఎంతో ప్రాధాన్యం ఉందని, ప్రతి ఒక్కరికి న్యాయ సహాయం అవసరం అవుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులతో చర్చ నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల కరస్పాండెంట్ డా. వంకి పెంచలయ్య మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతమైన కర్నూలును విద్యాపరంగా అభివృద్ధి పరిచేందుకు తాను 1999లో ఈ కళాశాలను ప్రారంభించానని అన్నారు. సీనియర్ న్యాయవాది పోకల శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ డా.ఎం. శివాజీరావు, డీన్ శివకుమార్, లా కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల అవార్డులకు ఆహ్వానం

కర్నూలు హాస్పిటల్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 5 నుంచి 18 సంవత్సరాల లోపు వయస్సుగల బాలల నుంచి కేంద్ర ప్రభుత్వం జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారి (ఐసీడీఎస్) పి. నిర్మల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, ధైర్యసాహసాలు, క్రీడలు, కళల, సంస్కృతి మొదలగు వాటిలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన భారతదేశానికి చెందిన బాలలు జూలై 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

మహానందిలో హైదరాబాద్ సిటీ అడిషనల్ ఎస్పీ పూజలు



మహానందిలో పూజలు నిర్వహించడానికి వస్తున్న హైదరాబాద్ సిటీ అడిషనల్ ఎస్పీ జానకిరెడ్డి

మహానంది, మే 22 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో గురువారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ సిటీ అడిషనల్ ఎస్పీ జానకిరెడ్డి ప్రత్యేక పూజలుచేశారు. ఆలయం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకా ర్చనలను నిర్వహించారు. యాగశాల మంటపంలో అడిషనల్ ఎస్పీని వేదపండితులు ఆశీర్వదించారు. ప్రసాదాలు అందచేశారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ



రాఘవేంద్రుని సన్నిధిలో హెచ్‌డీ రేవన్నకు ప్రసాదం అందజేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, మే 22 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ కుమారుడు, మాజీ మంత్రి ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ గురువారం మంత్రాలయానికి వచ్చారు. ఈయనకు మఠం ఏఏవో మాధవ శెట్టి, మేనేజర్లు శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తిలు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు రేవణ్ణను ఆశీర్వదించారు.

పరిశ్రమలకు చేయూత

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు భారీగా సబ్సిడీ
- పెట్టుబడి రాయితీ కల్పిస్తున్న ప్రభుత్వం

నంద్యాల హాస్పిటల్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమలకు ప్రభుత్వం చేయూతనిస్తోంది. ఎన్నడూ లేనివిధంగా భారీగా సబ్సిడీలు ఇస్తూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తోంది. గత ప్రభుత్వం పరిశ్రమలకు 15శాతం సబ్సిడీ ఇవ్వగా ప్రస్తుత ప్రభుత్వం 25శాతం సబ్సిడీని పెంచి పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడుతోంది. దీంతో పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు ముందడుగువేస్తున్నారు. సామాన్య ప్రజలు పరిశ్రమ స్థాపించాలంటే జిల్లా కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగకుండా నేరుగా ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకొని ఏవైనా ఆటంకాలున్నా పరిశ్రమల అధికారులు గైడ్ చేస్తూ ప్రోత్సహించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా పరిశ్రమల కార్యాలయంలో పేపర్ రహిత పరిపాలన సాగుతోంది. పారిశ్రామికవేత్తలు ఎలాంటి దరఖాస్తులు కార్యాలయానికి తీసుకురావాల్సిన అవసరంలేకుండా జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అధికారులు ప్రోత్సహిస్తున్నారు. పరిశ్రమల స్థాపనతో ప్రజలకు ఉపాధి కల్పించడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం కూడా లభించే అవకాశం ఉంది. జిల్లాలో ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మైక్రో స్మాల్, మీడియం ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ పాలసీలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. రూ.25 లక్షల నుంచి రూ.7కోట్ల వరకు సబ్సిడీ ఇచ్చేందుకు కొత్త పాలసీ తీసుకువచ్చింది. పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి రాయితీ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

బడుగు వికాసం పాలసీ

జిల్లాలో ఎస్సీ, ఎస్టీల కోసం బడుగు వికాసం పాలసీ కింద ట్రాన్స్‌పోర్టు విభాగంలో ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బడుగు వికాసం పాలసీ తీసుకువచ్చింది. 45శాతం సబ్సిడీతో రూ.75లక్షల వరకు రాయితీ పొందేందుకు ఎస్సీ, ఎస్టీలకు అర్హత ఉంది. దాదాపు రూ.2కోట్ల ప్రాజెక్టులు బడుగు వర్గాలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేసిన తర్వాత 6నెలలకు సబ్సిడీ నేరుగా బ్యాంకు ఖాతాకు జమచేయనున్నారు.



పెట్టుబడి రాయితీ ఇలా

పరిశ్రమ	పెట్టుబడి వ్యయం	సబ్సిడీ (గరిష్ఠంగా)	రాయితీ కాలపరిమితి
మైక్రో ఇండస్ట్రీస్	రూ.5కోట్లు	రూ.25లక్షలు	రెండేళ్లు
స్మాల్ ఇండస్ట్రీస్	రూ.50కోట్లు	రూ.1.50కోట్లు	మూడేళ్లు
మీడియం ఇండస్ట్రీస్	రూ.250కోట్లు	రూ.7కోట్లు	నాలుగేళ్లు

పారిశ్రామికవేత్తలకు సదవకాశం



పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం మంచి అవకాశం ఇచ్చింది. ప్రస్తుతం సబ్సిడీ కూడా 10శాతం ఎక్కువగా ఇస్తూ పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహిస్తోంది. 18ఏళ్లు పైబడినవారు పరిశ్రమలు స్థాపించుకునేందుకు అవకాశం ఉంది. ఈ సదవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ వర్గాలు వినియోగించుకోవాలి. పరిశ్రమల స్థాపనతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సాధారణ వ్యక్తులకు కూడా ప్రస్తుతం 25శాతం సబ్సిడీ ప్రభుత్వం అందిస్తోంది. ఔత్సాహికులు నేరుగా ఏపీ ఇండస్ట్రీస్ . జీవోవీ . ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌నుంచే పొందవచ్చు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలి.

జవహర్‌బాబు, జిల్లా పరిశ్రమల అధికారి



వర్షపు నీటితో నిండిన నాపరాయి గని

గనుల్లో నీళ్లు ..

- ఉపాధి కోల్పోతున్న కార్మికులు
- ఆందోళనలో గనుల యజమానులు

కొలిమిగుండ్ల, మే 22 (ఆంధ్రజ్యోతి) : భిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కురిసిన వర్షాలకు నాపరాతి గనుల్లో నీళ్లు చేరాయి. నాపరాయి గనుల్లో చేరుతున్న వర్షపు నీరు గని కార్మికులకు ఆవేదన కలిగిస్తోంది. ఉపాధి కోల్పోయి బిక్కుబికుమంటూ జీవనం సాగిస్తున్నారు. కొలిమిగుండ్ల మండలంతో పాటు, అవుకు, బనగానపల్లె తదితర ప్రాంతాల్లో నాపరాయి గనుల ద్వారా వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలోని బెలుం, బెలుంశింగవరం, మీర్జాపురం గ్రామాల్లోని నాపరాయి గనుల్లో వర్షం నీరు పెద్దఎత్తున చేరుతోంది. దీంతో లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ప్రారంభించిన గనులు చేసుకోలేని పరిస్థితి నెలకొందని గనుల యజమానులు వాపోతున్నారు. గనులు నీటితో నిండటంతో ఇటు యజమానులకు, అటు కార్మికులకు పనిలేక జీవనం భారంగా మారే పరిస్థితి నెలకొంది. ఈఏడాది ఎండాకాలంలోనే గనుల్లో నీరు చేరుతున్నాయని, గనులు చేసుకునే పరిస్థితి లేకుండా పోయిందని బాబు అనే గని యజమాని తెలిపారు.



నాపరాయి వెలికి తీస్తుండగా వర్షంతో గనుల్లో చేరిన నీరు

క్రీడా జోష్

- జిల్లాలో 50 వేసవి శిక్షణ శిబిరాలు
- ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు
- క్రీడాకారుల వివరాలు క్రీడా యాప్‌లో నమోదు
- శాప్ నుంచి సర్టిఫికెట్లు అందజేత



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



నంద్యాలలోని డీఎస్ఏ స్టేడియం

నంద్యాల హాస్పిటల్, మే 22 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో పిల్లల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో శిక్షణ ఇప్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో భవిష్యత్తులో క్రీడల్లో రాణించేందుకు అవకాశం ఉంటుంది. శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్)నుంచి సర్టిఫికెట్లు కూడా అందిస్తున్నారు. ప్రతి ఏటా వేసవి సెలవుల్లో శిక్షణ శిబిరం నిర్వహించడంతో క్రీడాకారులు తయారు అవుతున్నారు. జిల్లాలో 50వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు వీటికి క్రీడా సామగ్రితో పాటు శిక్షకుడికి గౌరవ వేతనం ఇవ్వనున్నారు.

ఉదయం 6 గంటల నుంచి...

జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈశిబిరాలకు ప్రభుత్వం రూ.3.5లక్షలు కేటాయిం చింది. ఇందులో రూ.5వేలు క్రీడాసామగ్రికి, రూ.1500 శిక్షకుడికి, మరో రూ.500 నిర్వహణ నిమిత్తం ఉపయోగించాల్సి ఉంది. ప్రతి శిబిరంలో 25మంది బాలురు, 25మంది బాలికలకు శిక్షణ ఇస్తారు. ఉదయం 6నుంచి 8గంటల వరకు, సాయంత్రం 5నుంచి రాత్రి 7గంటల వరకు శిక్షకులు శిక్షణ ఇస్తారు. 8నుంచి 14ఏళ్లలోపు బాల, బాలికలు ఈఅవకాశం కల్పించారు. శిక్షణ పొందుతున్న క్రీడాకారుల వివరాలు క్రీడాయాప్‌లో శిక్షకులు నమోదు చేయాల్సి ఉంటుంది. రిజిస్టర్ చేసుకున్నవారికి నేరుగా ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్ కూడా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఇవ్వనుంది. నం ద్యాలలో ఎస్పీజీ మైదానంలో ఫుట్‌బాల్, హాకీ, ఇండోర్ స్టేడియంలో తైక్వాండో, వాలీబాల్, ఫెన్సింగ్ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు.

శిబిరాలను వినియోగించుకోవాలి



వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలి. రూ.2.5లక్షలతో క్రీడా సామగ్రిని అందజేశాం. వాలీబాల్, ఫుట్‌బాల్, బాక్సింగ్, తైక్వాండో, బాల్‌బాడ్మింటన్, హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్, యోగాకు సంబంధించి సామగ్రిని అందజేశాం. పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు, శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు ఈశిబిరాలు ఎంపిక చేశాం. ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహించాల్సిఉంది.

- ఎంఎన్‌వీ రాజు,
జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, నంద్యాల



ఎస్పీజీ మైదానంలో హాకీ నేర్చుకుంటున్న క్రీడాకారులు



విద్యుత్ స్తంభం ఎక్కడ?

గోనెగండ్ల, మే 22(ఆంధ్రజ్యోతి): ఇదేంటి చెట్టులోంచి విద్యుత్ వైర్లు కనిపిస్తున్నాయని అనుకుంటున్నారా? బాగా గమనిస్తే తెలుస్తుంది. అక్కడ ఓ విద్యుత్ స్తంభం ఉందని. మండలంలోని ఎన్నెకండ్ల గ్రామ శివారులో గోనెగండ్లకు వెళ్లే ప్రధాన దారిలో ఉన్న ఈ విద్యుత్ స్తంభానికి అడ్డుగా చెట్లు ఏపుగా పెరిగాయి. దానికి తోడు తీగలు సైతం విద్యుత్ స్తంభాన్ని పై వరకూ అల్లుకుపోయాయి. దీంతో విద్యుత్ స్తంభం తీగలు, చెట్ల చాటుకు వెళ్లిపోయింది. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారో విద్యుత్ శాఖ అధికారులకే తెలియాలి మరి.

- గోనెగండ్ల (ఆంధ్రజ్యోతి)

ఎంవీఐపై కర్ణాటక వాసి దాడి

• తమ వాహనాన్ని ఆపారని ఆగ్రహం



కర్ణాటక వాసులను వారిస్తున్న తాలుకా పోలీసులు

ఆదోని రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మా వాహనాన్నే ఆపుతావా అని ఆదోని ఎంఈఐపై కర్ణాటక వాసులు దాడికి పాల్పడ్డారు. వివరాల మేరకు.. ఆస్పరి బైపాస్‌లోని విరుపాపురం సమీపంలో ఆదోని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కదిరి మహమ్మద్ అఫైద్ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఇంతలో కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా నాలూరు తాలుక హోసావెళ్లి గ్రామానికి చెందిన చంద్రప్ప, కుటుంబ సభ్యులు 14 మంది మినీ బస్సులో మంత్రాలయంలో దర్శనం అనంతరం కర్ణాటకకు తిరుగు ప్రయాణమయ్యారు. తన విధుల్లో భాగంగా ఎంవీఐ వాహనాన్ని తనిఖీ చేస్తుండగా చంద్రప్ప కుటుంబ సభ్యులు ఎంవీఐతో వాగ్వాదానికి దిగారు. నీవు అసలు ఎంవీఐవేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రయ్య సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా, ఎంఈఐ సెల్‌ఫోన్ లాక్కొని పగులకొట్టి తన వాహనం స్టార్ట్ చేయగా, కర్ణాటక వాసి చంద్రప్ప ఎంవీఐ వాహనం బంపర్‌పై కూర్చున్నా ఎంఈఐ కిలోమీటర్ వరకు అలాగే వాహనాన్ని నడిపారు. దీంతో మినీబస్సు డ్రైవర్ ప్రకాష్ తన వాహనాన్ని వేగంగా తీసుకెళ్ళి ఎంవీఐ వాహనానికి అడ్డంగా పెట్టాడు. అప్పటికే ట్రాఫిక్ జామ్ కావడంతో విషయం తెలుసుకొన్న తాలుక ఎస్.ఐ రామాంజనేయులు సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. తన విధులకు ఆటంకం కలిగించారని ఎంవీఐ కర్ణాటక వాసి చంద్రయ్యపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ తెలిపారు.

పేకాటలో పట్టుబడ్డ వైసీపీ నాయకులు

బనగానపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కౌసర్‌బాగ్ వద్ద పేకాట ఆడుతూ నలుగురు వైసీపీ నాయకులు పట్టుబడ్డారు. ఇది చర్చనీయాంశంగా మారింది. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డి తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై గురువారం దాడి నిర్వహించారు. వైసీపీ నాయకులు సంకేపల్లి ప్రతాపరెడ్డి, బండి బ్రహ్మానందరెడ్డి, మంగవరం శంకర్‌రెడ్డి, బండి పుల్లారెడ్డి పేకాట ఆడుతూ పట్టుబడినట్లు వారు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.10,610 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నేరాల అదుపునకు సహకరించాలి

• సీఐ మధుసూదన్‌గౌడు • షరీన్‌నగర్‌లో తనిఖీలు
• పత్రాలు సరిగా లేని 12 బైకుల స్వాధీనం



షరీన్‌నగర్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి): నేరాల అదుపునకు ప్రజలు సహకరించాలని నాలుగో పట్టణ సీఐ మధుసూదన్‌గౌడు పేర్కొన్నారు. గురువారం షరీన్‌నగర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ బాబుప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ మధుసూదన్‌గౌడు సబ్ డివిజన్ ఎస్ఐలు, సిబ్బంది, హోంగార్డ్స్‌తో కలిసి పాత నేరస్థులు, రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లలో తనిఖీలు చేశారు. వాహనపత్రాలు సరిగ్గా లేని 12 బైకులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ కౌన్సెలింగ్ చేశారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై, కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఆర్ఎంపీ వైద్యంతో మహిళ మృతి

• ప్రాణం హరించిన పంటినొప్పి ఇంజెక్షన్



సుబ్బలక్ష్మమ్మ (ఫైల్)

సంజామల, మే 22(ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ వైద్యం ఒక నిండు ప్రాణాన్ని బలికొంది. పంటినొప్పికి వేసిన ఇంజెక్షన్ వికటించిన సంఘటన నంద్యాల జిల్లా సంజామల మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని చిన్నకొత్తపేట గ్రామానికి చెందిన బుర్రా సుబ్బలక్ష్మమ్మ (52) బుధవారం రాత్రి పంటినొప్పితో సంజామల ఆర్.ఎం.పీ వైద్యుడు దస్తగిరి వద్దకు వెళ్లింది. ఆయన నరానికి ఇంజెక్షన్ వేయడంతో అక్కడికక్కడే మహిళ స్పృహతప్పి పడిపోయింది. తన తల్లి నోటి నుంచి నురుగు రావడంతో వెంట వెళ్లిన కొడుకు బాలకృష్ణ ఆందోళన చెందాడు. వైద్యుడు వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి, ఆమెను కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే సుబ్బలక్ష్మమ్మ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్.ఐ రమణయ్య నంద్యాల ప్రొఫెసర్ ఆధ్వర్యంలో శవ పరీక్ష చేయించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కొడుకులు, భర్త ఉన్నారు. ఆరోగ్యంగా ఉంటూ కూలి పనికి వెళ్లి వచ్చే తల్లి ఇలా మరణించిందని కొడుకులు కన్నీటి పర్యంతమయ్యారు.

'మావోయిస్టు నేతల హత్యలపై న్యాయ విచారణ జరిపించాలి'



మాట్లాడుతున్న విరసం రాష్ట్ర నాయకుడు పాణి

కర్నూలు కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు, నాగేశ్వరరావు, ఇతర ఆదివాసీ మావోయిస్ట్ హత్యలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు హత్యను నిరసిస్తూ గురువారం నగరంలోని పీవోడబ్ల్యూ కార్యాలయంలో ప్రజా సంఘాల సమావేశం జరిగింది. ఇందులో వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్ట్ అగ్ర నాయకులతోపాటు అమాయక ఆదివాసీ యువకులను చంపివేస్తున్నారన్నారు. విరసం రాష్ట్ర కమిటీ సభ్యుడు పాణి మాట్లాడుతూ కేశవరావు మావోయిస్టు ఉద్యమాన్ని సైనిక, రాజకీయ రంగాల్లో అత్యున్నత స్థాయికి తీసికెళ్లాడన్నారు. ఈ దేశ సంపదలను కార్పొరేట్లకు కట్టబెట్టడానికే మావోయిస్టు నాయకులను, ఆదివాసులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హత్య చేస్తున్నాయని అన్నారు. పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి అల్లాబకాష్ మాట్లాడుతూ కేశవరావు బూటకపు ఎన్‌కౌంటర్‌ను మైదాన ప్రాంతంలోని ప్రజాస్వామికవాదులు ప్రశ్నించాలని అన్నారు. రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న మాట్లాడుతూ దేశ ప్రజలపై సొంత సైన్యం యుద్ధం చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. సీపీఐ బాధ్యుడు మహేష్, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ భాస్కర్ రెడ్డి, డీటీఎఫ్ నాయకుడు కేఆర్‌వై, ఎస్‌యూసీఐ నాయకుడు నాగన్న, ఉపాధ్యాయ నాయకుడు రాజా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సారాను నిర్మూలించండి

• నవోదయం-2 పై డైరెక్టర్ ఆరా.. • డీసీ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష



డైరెక్టర్‌ను సన్మానిస్తున్న ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు

కర్నూలు అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సారాను పూర్తిగా నిర్మూలించాలని ఎక్సైజ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ అన్నారు. గురువారం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ వి. హనుమంతరావు, డీపీఈవో, ఏఈఎస్‌లతో ఆయన నవోదయం-2లో సారా నిర్మూలనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాటు సారాయి, సుంకం చెల్లించని అక్రమ మద్యం, గంజాయిని అరికట్టడంలో తీసుకోవాల్సిన చర్యలు, వీటిపై నమోదు చేసిన కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కర్నూలును సారా రహిత జిల్లాగా ప్రకటించడానికి అందరూ కృషి చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కంట్రోల్ రూమ్ నుంచి బార్డర్ చెక్ పోస్టుల పనితీరును పరిశీలించారు. చెక్ పోస్టుల్లో నిఘా పెంచి అక్రమ మద్యం జిల్లాలోకి రాకుండా అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. రీజినల్ ఎక్సైజ్ ల్యాబొరేటరీ, అందులోని పరికరాలను పరిశీలించి ల్యాబ్ పని తీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ సుధీర్ బాబు, ఏఈఎస్ రాజేఖర్‌గౌడ్, రామక్రిష్ణారెడ్డి, సీఐలు రాజేంద్రప్రసాద్. జయరాం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్‌ను కలిసిన జిల్లా ఎక్సైజ్ అధికారుల సంఘం

ఎక్సైజ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మను జిల్లా ఎక్సైజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలోని సమస్యలు పరిష్కరించాలని, కానిస్టేబుల్, సిబ్బంది కొరత వల్ల ఉద్యోగులకు పని భారం ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఐ సందీప్, సోమశేఖర్, నవీన్, రేహనా బేగం పాల్గొన్నారు.

కురువ విద్యార్థులకు బహుమతులు



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ప్రాంగణంలోని ఎంపీపీ హాలులో గురువారం ప్రతిభావంతులైన 135 మంది కురువ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.వెయ్యి ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం పది, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులైన 135 మంది కురువ విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు గుడిసె శివన్న, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, అమీలియో హాస్పిటల్ అధినేత డా. లక్ష్మీప్రసాద్, భానుశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాల లొల్లి.. ఆగిన పెళ్లి

• నిశ్చితార్థం రోజే పెళ్లి కొడుకు ఆత్మహత్యాయత్నం • చికిత్స పొందుతూ మృతి • ఆదోని మండలంలో విషాదం



వరుడు రాజు (ఫైల్)

ఆదోని రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయల విషయంలో జరిగిన లొల్లితో ఓ పెళ్లి ఆగిపోయింది. నిశ్చితార్థం రోజే పెళ్లికొడుకు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా కోలుకోలేక గురువారం మృతిచెందినట్లు ఇస్వీ ఎస్ఐ నాయక్ తెలిపారు. వివరాలు.. ఆదోని మండలం హనవాళ్లు గ్రామానికి చెందిన గోరంట్ల, ఈరమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. గోరంట్ల హాళగుంద ఎల్లెల్సీ కాల్వ లస్కర్‌గా పనిచేస్తున్నాడు. వీరి రెండో కుమారుడు హరిజన రాజు(20) అదే మండలానికి చెందిన పెద్దగొనేహాళ హోసూరుకు చెందిన మహిమజ్యోతి అనే యువతిని ప్రేమించాడు. ప్రేమికులిద్దరు కుటుంబ సభ్యులకు తమప్రేమ వ్యవహారం చెప్పి పెళ్లికి ఒప్పించారు. అయితే మహిమజ్యోతి తల్లిదండ్రులు క్రిస్టియన్ పద్ధతిలో పెళ్లిచేయాలని రాజు తల్లిదండ్రులకు మెలికపెట్టారు. హిందూ సంప్రదాయ బద్ధంగా పెళ్లి చేసుకుంటానని రాజు మొండికేశాడు. అయినప్పటికీ ఇరువురు తల్లిదండ్రులు క్రిస్టియన్ పద్ధతిలో పెళ్లి చేసేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 16వ తేదీన ముహూర్తం ఖరారుచేశారు. 15వ తేదీన రాజు ఇంటివద్ద పెళ్లి పందిరి కూడా వేశారు. అదేరోజు మధ్యాహ్నం రాజు తనబావతో కలిసి బైక్‌పై ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వెళ్లాడు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో పెద్దహరివాణం సమీపంలో అత్య వసరం ఉందని బైక్ ఆపాలని కోరాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే పురుగుమందు తాగి అపస్మారకస్థితిలో ఉన్నాడు. అతడిని హుటాహుటిన ఆదోని ప్రభుత్వాస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉండడంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించగా కోలుకోలేక గురువారం రాజు మృతిచెందాడు. వరుడు మృతితో ఇరు కుటంబాల్లో విషాదం నెలకొంది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సీఐ తీరుపై దుమారం

• ఉన్నతాధికారులకు ఓ మహిళ ఫిర్యాదు
• ప్రజాప్రతినిధి వద్ద పంచాయితీ? • ఆలస్యంగా వెలుగులోకి..

నంద్యాల, మే 22(ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో పనిచేస్తున్న ఓ సీఐ తీరుపై దుమా రం రేగుతోంది. గుట్టుచప్పుడు కాకుండా ఓ మహిళ రెండు వారాల కిందట సదరు వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినట్లు సమాచారం. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రాగా ఆశాఖ వర్గాల్లో పలువిదాలుగా చర్చ సాగుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. సదరు సీఐ కొంత కాలంగా ఓ మహిళా ఉద్యోగితో (ఇతర శాఖలో పనిచేస్తున్న) బాధ్యతారహితంగా వ్యవహరించారని సమాచారం. ఈ వ్యవహారం చాలాకాలం నుంచి జరుగుతోందని వినికిడి. ఆయితే ఇద్దరికి కూడా బాగానే సన్నిహిత్యం ఉండేదని సమాచారం. ఇంతలోనే ఏమైందో.. ఏమో కానీ..? ఇరువురి మధ్య ఏదైనా సమస్య ఏర్పాడిందా..? గతంలో మాదిరిగా ఇరువురు ఉండ లేదనే ఏమైనా తలెత్తిందా..? అనే అనుమానాలకు తావిస్తోంది. ఆ మహిళ ఈసీఐని ఎంత బతిమిలాడిన సద్దుమణిగేలా వ్యవహరించడం లేదని సమాచారం. సీఐ తీరులో మార్పు లేకపోవంతో ఆమె నేరుగా ఇటీవల ఎస్పీతో పాటు డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. సమస్య పరిష్కారం అయిందో.. లేదో తెలియదు. కానీ ఆ మహిళా ఉద్యోగి సీఐ తీరుపై ఓ ప్రజాప్రతినిధి వద్ద గోడు చెప్పి పంచాయితీ పెట్టినట్లు సమాచారం. ఏది ఏమైనా పోలీసుశాఖలో ఇలాంటి వ్యవహారం చోటు చేసుకోవడం విమర్శలకు తావిస్తోంది.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బస్సు

• క్లీనర్ మృతి

డోన్ టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాతీయ రహదారిపై కొత్తపల్లి ఫ్లైఓవర్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు ప్రమా దంలో లారీ క్లీనర్ మృతి చెందారు. వివరాలివీ.. డోన్ పట్టణం హైవే మొబైల్-3 వద్ద కొత్తపల్లి ఫ్లైఓవర్ మీద ఓ లారీ పంక్చర్ కావడంతో నిలబడిన లారీ సైడులో లారీ క్లీనర్ చంటి రాళ్లు పెడుతుండగా.. కదిరి నుంచి హైదరా బాదు వెళ్తున్న బస్సు వెనుక వైపు నుంచి లారీని ఢీకొట్టింది. లారీ వెను కాల ఉన్న క్లీనర్ బస్సు ఢీకొనడంతో లారీకి, బస్సుకు మధ్యలో ఇరుక్కుపోయి మృతి చెందాడు.. లారీ డ్రైవర్ అమీర్, బస్సు డ్రైవర్ భాస్కర్‌కు గాయాలయ్యాయి. అలాగే బస్సులోని ఇద్దరు ప్రయాణికులకు కూడా గాయాలయ్యాయి. గాయాలైనవారిని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

పెళ్లిపీటలు ఎక్కకుండానే యువతి మృతి

ఆస్పరి, మే22(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల్లో దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టాల్సిన యువతి పెళ్లి పీటలు ఎక్కక ముందే తనువు చాలించింది. వివరాల మేరకు.. కాశన్న, బీబీ దంపతులకు నలుగురు కుమార్తెలు. మూడవ సంతానమైన సబేరా(20)కు వివాహం నిశ్చయమైంది. గురువారం కుళాయి విద్యుత్ మోటార్‌ను ఆన్‌చేయబోయి విద్యుదాఘాతానికి గురైంది. తల్లిదండ్రులు పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

కుట్టు శిక్షణతో వెలుగు

• బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ
• శిక్షణ అనంతరం కుట్టుమిషన్ల పంపిణీ
• స్వయం ఉపాధి పొందుతామంటున్న మహిళలు



హాలహర్విలో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు

హాలహర్వి, మే 22 (ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణ బీసీ మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. స్త్రీశక్తిగా ఎదగాలని, స్వయం ఉపాధితోనే ఇది సాధమన్న ప్రభుత్వ ఆశయం పేదలకు ఆర్థిక స్వావలబంన ఇస్తోంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..

బీసీ కార్పొరేషన్ తరపున ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే మహిళలకు శిక్షణ ఇస్తారు. మహిళలు స్వయం ఉపాధి పొందా లన్న లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం ప్రారంభించింది.

ఉచితంగా కుట్టు మిషన్లు

కుట్టు శిక్షణ 90 రోజులపాటు ఉంటుంది. శిక్షణకు 75 రోజుల పాటు హాజరైన వారికి ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్ అందజేస్తుంది. దీంతో మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం తమకు భరోసా ఇచ్చిందని మహిళలు అంటున్నారు.

కుట్టుతో పాటు ఎంబ్రాయిడరింగ్‌లో శిక్షణ

హాలహర్వి మండలంలో దాదాపు 70 మంది వరకు మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ ప్రారంభించి నెల పూర్తవుతోంది. టైలరింగ్, అల్లికలు, ఎంబ్రాయిడరింగ్, రకరకాల ఫ్యాషన్లలో కుట్టు నేర్పిస్తున్నారు.



కుట్టు శిక్షణతో భరోసా

మాది నిరుపేద కుటుంబం. నేను పొలం పని చేయలేను. నా భర్త కూలితో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం ఇస్తున్న ఉచిత కుట్టుశిక్షణకు రోజూ వస్తున్నారు. పూర్తయితే నాకు ఎంతో భరోసాగా ఉంటంది. **- ముత్తమ్మ, హాలహర్వి**



ఎంతోమంది మహిళలకు ఆసరా

బీసీ కార్పొరేషన్ ఇస్తున్న ఉచిత కుట్టు శిక్షణ వల్ల ఎంతోమంది మహిళలకు ఆసరా ఉంటుంది. మాలాంటి మహిళలకు ఇలాంటి శిక్షణలు మేలు చేస్తాయి. ఉచితంగా కుట్టుమిషన్లు ఇవ్వడం వల్ల స్వశక్తితో ఉపాధి పొందవచ్చు. **- అనంతలక్ష్మి, అర్దగేరి గ్రామం**



స్వయం ఉపాధితో మేలు

సంక్షేమ పథకాల వల్ల మాకు ఒరిగిందేమీ లేదు. చేతివృత్తులు, అల్లికలు, కుట్టు శిక్షణతో ఊపిరినిస్తుంది. శిక్షణతో మా బతుకుల్లో వెలుగు చూడవచ్చు. ప్రభుత్వానికి మేము రుణపడి ఉంటాం. **- రాజేశ్వరి, పొదుపు మహిళ, హాలహర్వి**



మహిళలు ఉపయోగించుకోవాలి

ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పేద మహిళలకు ఉచితంగా కుట్టుశిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లు కూడా ఇస్తుంది. మహిళలు ఉపయోగించుకునిఉపాధి పొందాలి. కుటుంబాలను పోషించుకోవాలి. **- వరలక్ష్మి, ఎంపీడీవో, హాలహర్వి**

బంగారు వ్యాపారిపై కేసు నమోదు

• ఘటన జరిగిన రెండు వారాల తర్వాత కేసు



సీసీ పుటేజీలో రికార్డయిన దృశ్యాలు

నంద్యాల, మే 22(ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ బంగారు వ్యాపారిపై పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఘటన జరిగిన 14 రోజుల తర్వాత పోలీసులు ఇరువర్గాలపై కాకుండా సదరు వ్యాపారిపై మాత్రమే కేసు నమోదు చేయడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. నంద్యాల పట్టణంలోని పాతూరులో పేరు మోసిన ఓ బంగారు వ్యాపారి దుకాణం పెట్టుకుని గోల్డ్ వ్యాపారం చేస్తున్నారు. అయితే ఈ నెల ఏడో తేదీన పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు దుకాణానికి వెళ్లారు. అయితే అక్కడ ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ.. వ్యాపారితో దుకాణానికి వచ్చిన వారు దాడులు చేస్తున్నట్లు సీసీ పుటేజీలో రికార్డయింది. ఈ క్రమంలో వ్యాపారితో పాటు దుకాణానికి వచ్చిన వారు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ పోలీసులు ఇద్దరికీ సర్దిచెప్పి ఇరువర్గాలను పంపించారు. ఈయితే ఇదే విషయమై మరో మారు దాడికి పాల్పడిన వారందరు కలిసి సదరు వ్యాపారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని పోలీసులను నిలదీసినట్లు సమాచారం. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం సదరు వ్యాపారిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా చూస్తే వ్యాపారిపై దాడి చేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది. పోలీసులు మాత్రం దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. వ్యాపారి ఫిర్యాదు చేస్తే దాడి చేసిన వారిపై కూడా కేసు నమోదు చేస్తామని పోలీసులు చెబుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కర్నూలు క్రైం, మే 22(ఆంధ్రజ్యోతి): కర్నూలు రైల్వే స్టేషన్‌లో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయ స్సు 50 ఏళ్ల ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. శరీరంపై తెలుపు రంగు షర్టు, కషాయం రంగు టవల్ ఉన్నాయి. కుడి చేతిపైన 96975368 అనే అంకెలు ఉన్న టాటుమార్క్ ఉంది.

ఎడమ చేతిపైన ఓం సింబల్‌తో ఉన్న టాటు మార్కు ఉంది. ఆచూకీ తెలిసిన వారు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మాధవస్వామి నెంబరు 9441802327కు ఫోన్ చేయాలని పోలీసులు తెలిపారు.

వీరుల త్యాగాలను మరువలేం

● కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి
● కర్నూలు శివారులో తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు

కర్నూలు రూరల్ మే 22(ఆంధ్రజ్యోతి): దేశ భద్రత కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం కర్నూలు నగర శివారులోని నందికొట్కూరు ప్రధాన రహదారిలో ఎమ్మెల్యే దస్తగిరితో పాటు టీడీపీ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల నుంచి కమ్మసంఘం కల్యాణమండపం వరకు కొనసాగింది. కార్యక్రమంలో కోడుమూరు, గుడూరు, కర్నూలు, బెలగల్ మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈఈ ప్రభాకర్

ఓర్వకల్లు, మే 22(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈఈ ప్రభాకర్ లబ్ధిదారులకు సూచించారు. గురువారం ఓర్వకల్లు, నన్నూరు గ్రామాల్లో హౌసింగ్ లేఅవుట్‌లో జరుగుతున్న గృహాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలను జూన్ 12వ తేదీలోపు పూర్తి చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలకు, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ రామయ్య, ఇంజనీరింగ్ సహాయకుడు వినోద్ కుమార్ రెడ్డి ఉన్నారు.

సి.బెళగల్: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ సుమంత్ లబ్ధిదారులకు సూచించారు. గురువారం మండలంలోని కబంధహాల్ గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలానికి ఇప్పటి వరకు మంజూరైన 350 గృహాలలో దాదాపు పూర్తయ్యాయని అన్నారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టరు రంగన్న, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

నగర పరిశుభ్రతపై కమిటీ ఏర్పాటు

కర్నూలు న్యూసిటీ, మే 22(ఆంధ్రజ్యోతి): నగరాన్ని సుందరవనంగా తీర్చిదిద్దాలని.. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదని ఇటీవల రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కౌన్సిల్ హాలులో జరిగిన సమావేశంలో అధికారులను ఆదేశించారు. దీంతో కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు శానిటరీ సెక్రటరీలతో కలిపి కమిటీ ఏర్పాటు చేశారు. వీరు నగరంలో పారిశుధ్య పనులు గుర్తించడం, ఇంటింటి చెత్త సేకరణ జరుగుతుందా లేదా చూడటం, వాహనాలలో ఎంత చెత్త వెళ్తుంది, డ్రైనేజీలు, రోడ్లు శుభ్రంగా ఉండే విధంగా చూడటం కమిటీ సభ్యుల బాధ్యత. ఇలాంటివి గుర్తించి ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తారు.

నేడు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

కర్నూలు న్యూసిటీ, మే 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని 19వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం సాయంత్రం రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్ శంకుస్థాపన చేయనున్నారని కార్పొరేషన్ కమిషనర్ ఎస్. రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ ఆర్థిక సఘం, ఎన్‌క్యాప్, సాధారణ నిధులకు సంబంధించి మొత్తం రూ.12.30 కోట్లతో పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు మంత్రి శంకు స్థాపన చేస్తారని కమిషనర్ పేర్కొన్నారు.

'జగన్ మాటలను ప్రజలు నమ్మరు'

కర్నూలు అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌ను ప్రజలు చీకొట్టినా ఇంకా మీడియా ముందుకు రావడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై నోరు పారేసుకోవడం అలవాటుగా మారిందన్నారు.

వ్యవసాయ మోటారు చోరీ

కోడుమూరు రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరిలో ఓ రైతు పొలం వద్ద వ్యవసాయ మోటారును దుండగులు చోరీ చేశారు. బాధిత రైతు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు జరదొడ్డి వెంకటేశ్ కొంగనపాడు రస్తాలో హంద్రీనది ఒడ్డున ఉన్న పొలానికి విద్యుత్ మోటారు, పైప్‌లైన్ ఏర్పాటు చేసుకుని పంటలు సాగుచేస్తున్నాడు. ఇటీవల ఎకరన్నర చొప్పున పత్తి, బెండ విత్తాడు. మరో రెండు ఎకరాలను పత్తిసాగుకు సిద్ధం చేసి ఉంచాడు. గురువారం ఉదయం పొలానికి నీరు పెట్టడానికి వెళ్లగా విద్యుత్ మోటారు చోరీ అయిందని, మోటారుకున్న పైపులను ధ్వంసం చేసినట్లు గుర్తించాడు. సుమారు రూ.30వేలు నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని రైతు తెలిపారు.

నీటికుంటల నిర్మాణాన్ని వేగవంతం చేయండి

సి.బెళగల్, మే 22(ఆంధ్రజ్యోతి): నీటికుంటల నిర్మాణం వేగవంతం చేయాలని ఏపీవో రామన్న ఉపాధి సిబ్బందికి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఈసీ రంగస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబుకార్డు ఉన్న ఉపాధి కూలీలు బ్యాంక్ ఖాతకు ఆధార్ నంబరు తప్పనిసరి లింక్ చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

● కిటకిటలాడిన ఆంజనేయస్వామి ఆలయాలు
● పలు ఆలయాల్లో అన్నదానం
● భక్తులకు తీర్థప్రసాదాల అందజేత

కర్నూలు కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని శ్రీరామ, ఆంజనేయస్వామి దేవాలయాల్లో హనుమజ్జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం వేకువజాము నుంచే స్వామి వారి మూల, ఉత్సవమూర్తులకు పంచాభిషేకాలు, అర్చనలు ఆకు పూజలు, సింధూర లేపన పూజలు చేశారు. పలు చోట్ల 11 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ధర్మప్రచారకులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.

● సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో హనుమజ్జయంతిని ఘనంగా జరిగాయి. నగరంలోని దామోదరం సంజీవయ్య స్మారక నగరపాలక పాఠశాల క్రీడామైదానంలో వేడుకలు నిర్వహించారు. నంది అవార్డు గ్రహీత, ప్రవచనకర్త గుర్రపుశాల అంకయ్య, సమితి అధ్యక్ష, గౌరవాధ్యక్షులు కె. కృష్ణన్న, మోక్షేశ్వరుడు, ఎస్‌జీ మహాబలేష్, నాగోజీరావు, కల్కి మురళి, వెంగన్న చౌదరి పాల్గొన్నారు.

● జగన్నాథ గట్టుపై వెలసిన అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతిని వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇ. మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు, అర్చనలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

● సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. బళ్లారి చౌరస్తాలోని వీరాంజ నేయ స్వామి దేవస్థానం, పాతనగరంలోని శ్రీరామాలయం, హనుమాన్ ఆలయం, కుమ్మరివీధిలోని హనుమాన్ ఆలయం, వన్‌టౌన్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం, అశోక్‌నగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, బుధవారపేటలోని హనుమాన్ ఆలయం, బంగారుపేటలోని, వీఆర్ కాలనీలోని హనుమాన్ ఆలయాల్లో, షరీఫ్‌నగర్‌లోని సద్గురు త్యాగరాజ రామాలయంలో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, హుడిచెర్ల, నన్నూరు, ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, హుశేనా పురం, సోమయాజులపల్లె, కొమ్ముచెరువు, కాల్వ తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి సందర్భంగా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కొమ్ముచెరువు ఆంజనేయస్వామి ఆలయాన్ని నంద్యాల కలెక్టర్ రాజకుమారి సందర్శించి స్వామివారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను సన్మానించారు. ఓర్వకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు పూజలు చేశారు. చెన్నకేశవస్వామి భజన బృందం పాడిన భక్తిగేయాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

కార్యసాధకుడికి హనుమంతుడే ఆదర్శం: కార్యసాధకుడికి హనుమంతుడే ఆదర్శమని ధార్మిక ప్రవచకులు పల్నాటి చంద్రమౌళి అన్నారు. గురువారం ఓర్వకల్లులో హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఆంజనే యస్వామి ఆలయం ఎదురుగా తిరుమల తిరుపతి దేవస్థానం, ఉమ్మడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధార్మిక సభలో హనుమంతుని గుణ పరాక్రమాలపై ప్రసంగించారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డా.మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని యువత సరైన మార్గంలో నడవాలంటే బాల్యం నుండే ధార్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాంభూపాల్ రెడ్డి, పవన్‌కుమార్, లింగంకృష్ణయ్య వెంకట్రామిరెడ్డి, తోట రంగారెడ్డి, గోదా గోకులం సభ్యులు భీమిశెట్టి ప్రకాష్, నాగ సురేష్, అనూరాధ, జ్యోతి, రుక్మానందరెడ్డి, శివశంకర్, శేషయ్య, మురళి, విజయ లక్ష్మి పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. వెంకటగిరి గిడ్డాంబజనేయస్వామి ఆలయంలో అభిషేకాలు, ఆకుపూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను రథంపై కొలువుంచి ఎదురుమండపం వరకు లాగి తిరిగి రథశాలకు చేర్చారు. ఆలయంలో కుడా మాజీ ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ రఘునాథరెడ్డి పూజలు నిర్వహించారు. ముడుమలగుర్తి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేపట్టారు. టీడీపీ నాయకుడు మధు 500 మందికి అన్నదానం చేశారు. వర్కూరులో మునలయ్యతాత ఆలయం వద్ద హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా మధ్యాహ్నం చెక్కభజన, రాత్రి రాష్ట్రస్థాయి భజన పోటీలు ఏర్పాటు చేశారు.

● మండలంలోని వెంకటగిరిలో హనుమజ్జయంతి వేడుకలను పురస్కరించుకుని విష్ణుసేన ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పరుగుపందెం, స్పీడ్ సైకిల్ పందెం పోటీలు నిర్వహించారు. పరుగుపందెంలో హరి, చంద్రశేఖర్ విజేతలుగా నిలిచారు. వీరికి దాతలు ఎల్లప్ప రూ.7వేలు, నాగరాజు రూ. 5వేలు బహుమతి అందించారు. సైకిల్ పందెంలో విజేతలు చనుగొండ్లకు చెందిన హరిక్రిష్ణ, తిరుమలేష్‌లకు రూ.7వేలు, రూ.5వేలు దాతలు రమేష్, మోహన్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు నారాయణ, రాజు, గిడ్డయ్య, గంగులు, రవి పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక స్వయంభు ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, ఆకు పూజ చేశారు. స్వామివారి శోభాయాత్ర అశేష భక్త జనుల మధ్య సాగింది. హనుమాన్ సేవా సమితి భక్త బృందం పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలంలోని సి.బెళగల్, బ్రాహ్మణదొడ్డి, బురాన్‌దొడ్డి, గుండ్రేవుల, కంబంధహల్, కొత్తకోట, ముడుమాల తదిత గ్రామాల్లో అంజనేయస్వామికి భక్తులు పూజలు చేశారు.



కొమ్ముచెరువు క్షేత్రంలో
నంద్యాల కలెక్టర్ రాజకుమారిని ఆశీర్వదిస్తున్న అర్చకులు



హరిహర క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు



జగన్నాథగట్టుపై వెలసిన ఆంజనేయస్వామికి
పూజలు చేస్తున్న భక్తులు





వెంకటగిరిలో గిడ్డాంజనేయస్వామి రథోత్సవానికి హాజరైన భక్తులు, ఓర్వకల్లులో పూజలు చేస్తున్న భక్తులు



గూడూరులో..



మాట్లాడుతున్న మల్లు వెంకటరెడ్డి

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు



సిబ్బందికి సూచనలిస్తున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు న్యూసిటీ, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దని నగర పాలక మేనేజర్ చిన్నరాముడు సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదుల స్వీకరణ విభాగాన్ని తనిఖీ చేశారు. సంబంధిత విభాగ అధికారి అందుబాటులో లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ నగర ప్రజలు తమ కాలనీల్లో చిన్నపాటి సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ నెంబరు 7422992299కి ఫోన్ ద్వారా కానీ, వాట్సాప్ ద్వారా కానీ ఫిర్యాదు చేయొచ్చని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట నగరపాలక సిబ్బంది సరస్వతి, నాగమణి, రాజశేఖర్ ఉన్నారు.

పంటమార్పిడితో అధిక దిగుబడి: ఏవో

సి.బెళగల్, మే 22(ఆంధ్రజ్యోతి): పంట మార్పిడితోనే అధిక దిగుబడి సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. గురువారం మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం సి.బెళగల్‌లోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు.

క్లస్టర్ యూనివర్సిటీలో పనుల పరిశీలన

కర్నూలు అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీలో రూ.55కోట్ల రూసా నిధులతో నిర్మాణాలు జరుగుతున్న పనులను కమిటీ పరిశీలించింది. గురువారం క్లస్టర్, రాయలసీమ, ద్రావిడ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, బోయ విజయకుమార్ నాయుడు, డాక్టర్ వి. కిరణ్‌కుమార్, కడప ఆర్జెడీ సీఈ డి. నాగలింగారెడ్డి, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శశికళ, కడప సర్కిల్ ఏపీఈడబ్ల్యూ ఐడీసీ ఎస్‌ఈ ఎస్ శివకుమార్, ఏపీ ఎంఎస్ ఐడీఎస్ ఈఈ కె శ్రీనివాస్ రెడ్డి బృందం బిల్డింగ్ నిర్మాణాలను పరిశీలించారు. బిల్డింగ్‌లు, క్యాంటీన్, గ్రంథాలయం, క్లాస్‌రూమ్‌ల పిల్లర్ల నాణ్యత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్స్ జి శ్రీనివాస్, ఇందిరా శాంతి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీలో నలుగురు డిబార్

కర్నూలు అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరిగిన డిగ్రీ 2, 6వ సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులను డిబార్ చేశామని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో జరిగిన పరీక్షల్లో 2వ సెమిస్టర్‌కు 3,913 మందికి 3,499, 6వ సెమిస్టర్‌కు 75మంది దరఖాస్తు చేసుకోగా 67 మంది విద్యార్థులు హాజరయి పరీక్షలు రాశారని పేర్కొన్నారు.

జిల్లాస్థాయి మహానాడుకు తరలిన శ్రేణులు



జిల్లాస్థాయి మహానాడులో అమడగుంట్ల టీడీపీ నాయకులు

కోడుమూరు రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల నుంచి గురువారం జిల్లాస్థాయి మినీ మహానాడుకు తరలి వెళ్లారు. అమడగుంట్ల నుంచి టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పార్లమెంటు తెలుగుయువత కార్యదర్శి మాదన్న, బీసీ సెల్ మండల కార్యదర్శి రాజు, చిల్లబండ బాషా, ప్యాలకుర్తి ఉగాది వెంకటేశ్వర్లుయాదవ్, రాఘవేంద్రయాదవ్ అనుగొండ రామక్రిష్ణారెడ్డి తదితరులు వాహనాల్లో తరలివెళ్లారు.

బస్టాండు పరిసరాలను శుభ్రంగా ఉంచండి: కలెక్టర్

కర్నూలు రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ టి.శ్రీనివాసులును ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కర్నూలు కొత్తబస్టాండును తనిఖీ చేశారు. మౌలిక సదుపాయాలను, పార్కింగ్‌లను కలెక్టర్ పరిశీలించారు. హోటల్స్‌కు వచ్చే ప్రయాణికులు వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేసుకోకుండా తగిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బస్టాండు ప్రాంతంలో పరిశుభ్రత పాటించడం లేదని ఆర్‌ఎంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్యం మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చదువురాని ప్రయాణికుల కోసం వారు వెళ్లాల్సిన బస్సు ఏ ప్లాట్‌ఫాంలో ఉందని తెలియజేసే విధంగా ఒక మార్గదర్శకుని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. బస్టాండులో డ్రింకింగ్ వాటర్, కూల్‌డ్రింక్ షాపులలో ఉన్న వాటికి ఐఎస్ఐ మార్కు ఉందా లేదానే విషయాలను తనిఖీ చేయాలని కర్నూలు ఆర్డీవో, అర్బన్ తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. బస్టాండు ప్రాంగణంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన నోట్‌ను కర్నూలు మున్సిపల్ కమిషనర్‌కు ఇవ్వాలని ఆర్‌ఎంను ఆదేశించారు. బస్టాండు ఆవరణలో టాయిలెట్లు దుర్వాసన వెదజల్లుతుందని, బ్లీచింగ్ పౌడర్ చల్లించడంతోపాటు పినాస్థలిన్ బాల్స్ ఉంచాలని, ఇండియన్ వెస్ట్రన్ టాయిలెట్లు కొత్తవి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బస్టాండు ప్లాట్‌ఫాంలో పైకప్పు పెచ్చులు ఊడడం గమనించిన కలెక్టర్ వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలని ఆర్టీసీ ఈఈని ఆదేశించారు. బస్టాండు పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన ఆర్టీసీ ఆర్‌ఎంపై అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట ఆర్టీసీ డిపో-1, 2 మేనేజర్లు ఉన్నారు.



కొత్తబస్టాండు పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్

కర్నూలు క్రైం, మే 22(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. గురువారం స్థానిక కొత్తపేట సమీపంలో ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో 50 మంది ఆటో డ్రైవర్లకు రహదారి భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన వీడియోలు ప్రదర్శించి కౌన్సెలింగ్ చేశారు. ఈసందర్భంగా ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్సులు, రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అదానికి దోచిపెట్టడానికే స్మార్ట్ మీటర్లు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాధాకృష్ణ

కర్నూలు న్యూసిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): అదానికి దోచిపెట్టడానికే రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు పీఎస్. రాధాకృష్ణ విమర్శించారు. గురువారం 43వ వార్డులోని పలు కాలనీల్లో ఆయన పర్యటించి, స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా రాధా కృష్ణ మాట్లాడుతూ విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి టి.రాముడు, ఎం.భాస్కర్, నగేష్, శ్రీనివాసులు, హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

రహదారి బాగు చేయరా?

● పట్టణ పౌర సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్లారెడ్డి
● ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ కార్యాలయం ఎదుట నిరసన



కంటి ఆసుపత్రి ఎదుట నిలిచివున్న వర్షం నీటిని
పరిశీలిస్తున్న పట్టణ పౌర సంఘం నాయకులు

కర్నూలు హాస్పిటల్, మే 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రాంతీయ కంటి ఆస్పత్రికి వెళ్లే రోడ్డును బాగు చేయరా? అని పట్టణ పౌర సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్లారెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రశ్నించారు. గురువారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం కంటి ఆసుపత్రి ప్రాంతంలో పర్యటించింది. కంటి ఆసుపత్రి ఎదుట రోడ్డుపై నిలిచి ఉన్న వర్షపు నీటిని, రోగుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ కార్యాల యం ఎదుట నిరసన తెలిపారు. ఐదేళ్లుగా కంటి ఆసుపత్రి, డీఎంహెచ్‌వో కార్యాలయం రోడ్డు అధ్వానంగా ఉందని, ఈ రోడ్డు గుండానే రోగులు వెళ్త ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కరీముల్లాను కలిసి వినతి పత్రం సమర్పించారు. రోడ్డు విషయం జీజీహెచ్ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లాలని కరీముల్లా సూచించారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యాకోబు, రిటైర్డు ఎస్ఐ మోహిద్దీన్, సంఘం నాయకులు ఎండీ యూనుస్, ఎన్.శ్రీనివాసరెడ్డి, ఎస్.అన్వర్‌బాషా, ఎన్.మద్దిలేటి, బి.శశికుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కర్నూలుకు మంచి రోజులు : కేజే రెడ్డి

కర్నూలు న్యూసిటీ, మే 22(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు మంచిరోజులు వచ్చాయని, పెట్టుబడులు పెట్టేందుకు ఔత్సాహికులు సిద్ధంగా ఉన్నారని రాగమయూరి బిల్డర్ అధినేత కేజే రెడ్డి అన్నారు. గురువారం గాయత్రీ ఎస్టేట్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలోని ఎస్టీ, బీసీ కళాశాల మైదానంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించే ప్రాపర్టీ బిల్డ్ టెక్ షో కార్యక్రమానికి 60 మంది బిల్డర్లు పాల్గొంటున్నారన్నారు. ఈ ప్రాపర్టీ బిల్ టెక్ షోను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉద్యోగాలకు 75 మంది ఎంపిక

ఆలూరు రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఆలూరులో నిర్వహించిన జాబ్ మేళాలో 75 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎల్.ఆనంద్ రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం కళాశాలలో జాబ్ మేళా నిర్వహించగా, 12 కంపెనీ ప్రతినిధులు 201 మందికి ఇంటర్వ్యూలు చేశారన్నారు. కో ఆర్డినేటర్ వీరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రాతిదూలం పోటీలు మన సంస్కృతికి చిహ్నం



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ పులిశేఖర్

మద్దికెర, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించే రాతి దూలం పోటీలు పల్లె సంస్కృతికి అద్దం పడతాయనీ పత్తికొండ సీఐ పులిశేఖర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు జమేదార్ రాజన్న యాదవ్ అన్నారు. గురువారం ఎం.అగ్రహారం, ఎడవలి గ్రామాల మధ్యలో ఉన్న కృష్ణాపురంలో ఎద్దుల రాతిదూలం పోటీలు ప్రారంభించారు. గొడవలకు పాల్పడకుండా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఎమ్మెల్యే శ్యాంబాబు పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

వెల్దుర్తి, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి సందర్భంగా వెల్దుర్తి సమీపంలోని ఆలయంలో ఎమ్మెల్యే శ్యాంబాబు పూజలు చేశారు. పూజారులు రామాంజనేయులు ఎమ్మెల్యేను సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. సుబ్బరాయుడు, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు, మండల కన్వీనర్ బలరాంగౌడ్, రమాకాంత్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

పనికి తగ్గ వేతనం ఇస్తాం : ఏపీవో



కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

హాలహర్వి, మే22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పనికి తగ్గ వేతనం ఇస్తామని ఏపీవో చక్రవర్తి అన్నారు. గురువారం కూలీలతో సమావేశం నిర్వహించారు. ప్రతి కూలీకి రోజుకు రూ.300లు అందేలా చూస్తామన్నారు. ఈసీ దేవదాస్, టెక్నికల్ అసిస్టెంట్లు నాగరాజు, పుల్లయ్య పాల్గొన్నారు.

స్లూయిజ్ హామీపై హర్షం

దేవనకొండ, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లకొండ వద్ద స్లూయిజ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం పట్ల రైతు సంఘం నాయకుడు సూరి హర్షం వ్యక్తం చేశారు. గురువారం కర్నూలులో నిర్వహించిన టీడీపీ జిల్లా మహానాడులో ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారని సత్వరమే పనులు పెట్టేలా చూడాలని కోరారు.

బిల్లులు అందక అవస్థలు

- పత్తాలేని హౌసింగ్ అధికారులు
- బిల్లుల కోసం తిరుగుతున్న లబ్ధిదారులు



తుగ్గలిలో మూసి ఉన్న హౌసింగ్ కార్యాలయం

తుగ్గలి, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో 23 పంచాయతీలు ఉండగా, దాదాపు 55వేలకు పైగా జనాభా ఉంది. ప్రతి గ్రామంలో వివిధ ప్రభుత్వ పథకాల కింద లబ్ధిదారులు గృహాలు నిర్మించుకున్నారు. అయితే బిల్లుల మంజూరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, దరఖాస్తులు ఇవ్వడానికి తుగ్గలిలోని కార్యాలయం వస్తే హౌసింగ్ ఏఈ కనిపించడం లేదు. లబ్ధిదారులు మధ్యాహ్నం వరకు ఎదురు చూసి నిరాశతో ఇంటికి తిరిగి వెళ్తున్నారు. అయితే సచివాలయంలో కూడా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లేకపోవడంతో తుగ్గలికి రావాలిసి వస్తుందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. హౌసింగ్ అధికారులు వారానికోసారైనా గ్రామానికి వస్తే బాగుంటదని అంటున్నారు. గిరిజన గ్రామం వైబీ తండాలో టీడీపీ సానుభూతిపరులు దాదాపు 11 ఇళ్లు నిర్మించుకోగా 2018-19లో కింద బేస్‌మట్టం వరకు నిర్మించడంతో ఒక్కొక్కరికి రూ.25వేలు కూడా అందాయి. అనంతరం వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు అందలేదు. అయినా లబ్ధిదారులు అప్పు చేసి మరీ ఇల్లు నిర్మించుకున్నారు. ఇప్పటికైనా తమకు బిల్లులు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

● ఈ విషయమై ఇన్‌చార్జి డీఈ విజయకుమార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

సదరం క్యాంప్ ఏర్పాటు చేయాలి

ఆదోని టౌన్, మే22(ఆంధ్రజ్యోతి): సదరం క్యాంపులను పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలోనే నిర్వహించాలని ప్రభుత్వ ఆసుపత్రుల సలహా సంఘం మాజీ సభ్యుడు నసీరుద్దీన్ పటేల్ డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ సర్టిఫికెట్లు అందక దివ్యాంగులకు పింఛన్లు అందడం లేదన్నారు. కర్నూలుకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారని, అధికారులు స్పందించాలని కోరారు.

ట్రైబల్ సలహా మండలి సభ్యుడిగా వెంకటపతి



తుగ్గలి, మే 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటపతిని రాష్ట్ర ట్రైబల్ సలహా మండలి సభ్యుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. తనకు అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా హనుమజ్జయంతి

- ఆదోని, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో పూజలు, రథోత్సవంలో పాల్గొన్న భక్తులు





దేవనకొండ టర్నింగ్ వద్ద రథోత్సవం, పగిడిరాయిలో పల్లకి మోస్తున్న ఈశ్వర్‌రెడ్డి కుటుంబం



ఆదోనిలో పల్లకి మోస్తున్న అర్చకులు, భక్తులు

ఆదోని, మే22(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో హనుమజ్జయంతి వేడుకలు గురువార నిర్వహించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి భూపాల్ చౌదరి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మారుతి నాయుడు, టీడీపీ కౌన్సిలర్ పార్వతి వెంకటేష్ పూజలు చేశారు. జనసేన నాయకులు తిరుమల్ రెడ్డి, వాల్మీకి వెంకటేష్ జయరామ్, శ్రీన, వినయ్, జేపీ వెంకటేష్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఆదోని అగ్రికల్చర్ : పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి వైభవంగా నిర్వహించారు. శివారు ప్రాంతంలోని రణమండల ఆలయం, పోలీస్ క్వార్టర్స్ ఆలయం, బైపాస్‌లోని 42 అడుగుల విగ్రహానికి ఉదయం పంచామృతాభిషేకం, సింధూర సేవా, ఆకుపూజ, పల్లకి సేవ చేశారు. భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు.

మద్దికెర: హంప గ్రామంలో రథోత్సవాన్ని నిర్వహించారు. మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం గ్రామాల్లో పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు, రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు.

దేవనకొండ, మే 22(ఆంధ్రజ్యోతి): దేవనకొండ టర్నింగ్ వద్ద రథోత్సవం, మండలంలోని పోట్లపాడు, నేలతలమర్రి, పి.కోటకొండ, తదితర గ్రామాల్లో పూజలు నిర్వహించారు.

తుగ్గలి: మండలంలోని పగిడిరాయి గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం ఆంజనేయస్వామి రథోత్సవం నిర్వహించారు. పాటిల్ ఈశ్వర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు జగన్నాథరెడ్డి, సర్పంచ్ సౌజన్య, సలహాదారుడు హనుమంతు, నక్కల రమేష్‌మహేశ్వరరెడ్డి, రాము, గువ్వల నాగార్జున, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● మండలంలోని తుగ్గలి, జొన్నగిరి, పగిడిరాయి తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి నిర్వహించారు. టీడీపీ నాయకులు ఈశ్వర్ రెడ్డి, తిమ్మారెడ్డి, బీటీఎన్ రామాంజనేయులు, సొసైటీ సీఈవో గిడ్డయ్య, పూజారి ప్రహ్లాద్ భక్తులు పాల్గొన్నారు.

పల్లకి అందజేత: మండలంలోని పగిడిరాయి గ్రామంలో ఆంజనేయ స్వామిని ఊరేగింయడానికి రూ.లక్షతో తయారు చేసిన పల్లకిని టీడీపీ నాయకులు పాటిల్ ఈశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులు అందించారు.

ఆలూరు రూరల్ : పట్టణ సమీపంలోని బెళ్లిగుండు ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అలాగే హులేబీడు, కురకుంద, పెద్దహోతూరు, మనేకుర్తి, ముద్దనగేరి, కమ్మరచేడు తదితర గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి.

పత్తికొండ టౌన్: గ్రామ పంచాయతీ సమీపాన ఆంజనేయస్వామి ఆలయంలో, ఆదోని రోడ్డు నాయి బ్రాహ్మణ కాలనీలో పూజలు చేశారు.

బహిరంగ మద్యపానం ఆపండి



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదోని టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్యం షాపుల వద్ద బహిరంగ మద్యపానాన్ని ఆపాలని కాంగ్రెస్ నాయకులు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్, మైనార్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎండీ నూర్ డిమాండ్ చేశారు. గురువారం ఎక్సైజ్ సీఐ సైదుల్లాకు వినతిపత్రం ఇచ్చారు. ఆస్పరి బైపాస్ సమీపంలోని షాపు వద బహిరంగంగా మద్యం తాగుతున్నారని మహిళలు ఇబ్బంది పడుతున్నారన్నారు. తాయన్న, నెట్టేకల్ హనుమంతు పాల్గొన్నారు.

హాస్టల్ ఏర్పాటు చేయాలి



మంత్రితో బీజేపీ నాయకుడు కిరణ్ కుమార్

దేవనకొండ, మే 22(ఆంధ్రజ్యోతి): దేవనకొండలో బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని మండల బీజేపీ అధ్యక్షుడు బొల్లెదుల కిరణ్ కుమార్ కోరారు. గురువారం అమరావతిలో సోషల్ వెల్ఫేర్ మంత్రి డోల బాల వీరాంజినేయులును కలిశామన్నారు. విద్యలో మండలం వెనుకబడిందని హాస్టల్ లేక విద్యార్థులు బడి మానేస్తున్నారన్నారు. గతంలో మూసివేసిన డీఎస్టీ హాస్టల్‌కు సొంత భవనాలను నిర్మించి, నూతనంగా బీసీ బాలికల, ఎస్సీ, బీసీ బాలుర హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

ప్రజాప్రతినిధులకు విలువ లేదా?

- అధికారులపై మండిపడ్డ సర్పంచులు
- వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

పత్తికొండ టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులకు విలువ లేదా? కనీస సమాచారం ఇవ్వడం లేదని పంచాయతీ కార్యదర్శులపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ నారాయణదాసు అధ్యక్షతన పత్తికొండ మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. సర్పంచులకు తెలియకుండా ఉపాధి పనులు చేస్తున్నారని చిన్నహుల్తి సర్పంచ్ కేశవరెడ్డి నిలదీశారు. దూదేకొండ ఎంపీటీసీ వీరన్న మాట్లాడుతూ ఉదయం 11 గంటలైనా ఫొటోలు ఆన్‌లైన్ అప్‌లోడ్ చేసే విషయంలో ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పెండింగ్ వేతనాలు చెల్లించి ఉపాధి కూలీలను ఆదుకోవాలన్నారు. దూదేకొండ సర్పంచ్ రెహిమాన్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ ఖర్చులు, బిల్లులకు తేడా ఉందన్నారు. ఈవోఆర్డీ నరసింహులు జోక్యం చేసుకుని సర్పంచులతో సమన్వయం చేసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. స్వచ్ఛభారత్ కింద డ్రాచేసిన డబ్బును దూదేకొండ పంచాయతీ కార్యదర్శి తిరిగి ఖాతాల్లోకి జమ చేయాలని, అలా చేయని పక్షంలో ఆ ఉన్నతాధికారులకు చర్యలకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. ఎంపీడీవో కవిత, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

విత్తనాలు కొంటే రసీదు తీసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి రవి

మద్దికెర, మే 22 (ఆంధ్రజ్యోతి): రైతులు విత్తనాలు కొనేసమయంలో డీలరు వద్ద రసీదు తీసుకోవాలని ఏవో యు.రవి తెలిపారు. గురువారం ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. లైసెన్సు ఉన్న నమ్మకమైన ఎరువుల డీలర్ల వద్దే విత్తనాలు కొనాలని, విత్తన ప్యాకెట్‌పై ఉన్న లాట్ నెం. డీలర్ ఇచ్చే రసీదుపైని లాట్ నెంబరును సరి చూసుకోవాలని, గడువు, తేదీ, బిల్ నెం. రైతు, డీలర్ల సంతకాలు ఉండాలే జాగ్రత్త వహించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లూజు విత్తనాలు కొనవద్దన్నారు. డీలర్ భీమలింగప్ప, నాగభూషణం ఉన్నారు.

కురవలకు ప్రాధాన్యమివ్వాలి

ఆలూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): నామినేట్ పదవుల్లో టీడీపీ ప్రభుత్వం కురవలకు ప్రాధాన్యమివ్వాలని మాదాసి మాదారి కురవ సంఘం నాయకులు బెలగంటి హనుమప్ప, కురవ రామాంజినేయులు కోరారు. ఆవిర్భావం నుంచి పార్టీకి అండగా ఉన్నామని, కష్టకాలంలో పార్టీ బలోపేతానికి కృషాచేశామన్నారు. మొలగవల్లి వార్డు మెంబర్ నగిరి పద్మావతి, వెంకన్న, కిషోర్, సంతోష్, ప్రసాద్, ఈరన్న, వీరేశ్, మారుతి ఈరన్న, జగదీష్ పాల్గొన్నారు.ట

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- డీఆర్‌డీఏ పీడీ కేవీ రమణారెడ్డి



మాట్లాడుతున్న పీడీ రమణారెడ్డి

వెల్దుర్తి, మే 22(ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామికవే త్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ రమణారెడ్డి సూచించారు. గురువారం వెల్దుర్తి వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలతో మాట్లాడారు. మహిళలు కుటుంబ అవసరాల కోసం కిచెన్ గార్డెన్, వర్మికంపోస్టు తయారీతో ఉపాధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. బుక్ కీపర్ల ద్వారా రెగ్యులర్‌గా బుకులో నమోదు చేయించాలని, స్త్రీనిధి రికవరీ మోసాలను అరికట్టేందుకు యూపీఐతో లావాదేవీలు చేయాలని సూచించారు. ఎస్‌బీఐ సౌజన్యంతో పీఎంఎఫ్ ఎమ్ఈ పథకం కింద లక్ష్మీదేవికి మంజూరైన ఆయిల్ మిషన్‌ను ప్రారంభించారు. డీపీఎమ్‌లు నర్సమ్మ, నవీన్, ఏపీఎమ్‌లు అనురాధ, వెంకటస్వామి, కాశీశ్వరుడు, సీసీలు, ఎంఎంఎస్ ఓబీలు, పొదుపు సభ్యులు పాల్గొన్నారు.

సూర్యఘర్‌ను ఉపయోగించుకోవాలి

ఆస్పరి, మే22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఎం సూర్యఘర్ పథకాన్ని విద్యుత్ వినియోగదారులు ఉపయోగించుకోవాలని అధికారులు కోరారు. గురువారం తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో గీతావాణి, లైన్‌మెన్ శేషప్ప మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సబ్సిడీ కింద పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. వాడు కోగా మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వ మే కొనుగోలు చేస్తుందన్నారు.

డీలర్ వద్దే రేషన్

హొళగుంద , మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1వ తేదీ డీలర్ల వద్దే రేషన్ పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ నిజాముద్దీన్ గురువారం తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ బియ్యం సరఫరాకు మొగ్గుచూపగా, టీడీపీ ప్రభుత్వం దీన్ని మార్చిందన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ఆదోని, మే 22 (ఆంధ్రజ్యోతి): నవోదయం-2లో భాగంగా గురువారం ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆఫీసురాళ్ల కొండల్లో 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్లా తెలిపారు. దీంతోపాటు 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టణంలోని వాల్మీకి నగర్‌కు చెందిన సారా తయారీదారుడు బోయ మురళి అనే వ్యక్తి మీద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా హనుమజ్జయంతి

ఎమ్మిగనూరు మే 22 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతిని గురువారం ప్రజలు భక్తి శ్రద్ధల మధ్య జరుపుకున్నారు. అన్ని మండలాల్లో హనుమాన్ భక్తులు తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, గోనెగండ్ల మండలాల్లో వేడులు ఘనంగా జరిగాయి. సోగనూరు రోడ్డు వజ్ర అభయ ఆంజనేయస్వామి, వీవర్స్ కాలనీ ఆంజనేయస్వామి, బొడ్రాయి పురాతన ఆంజనేయస్వామి, రామస్వామి దేవాలయం, వెంకటాపురం ఆంజనేయస్వామి, 11వ వార్డు పాత ఆంజనేయస్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం కార్యక్రమం చేసి హనుమాన్ జయంతిని వైభవంగా జరుపుకున్నారు. వీవర్స్ కాలనీలో జరిగిన వేడుకల్లో ఆలయాల కమిటీ సభ్యులు కేఎస్‌పీ శివన్న, బిజ్జె నాగరాజు, అర్చకులు పాల్గొన్నారు.

● మంత్రాలయం

మండలంలోని మాధవరం, చెట్నహల్లి గ్రామాల మధ్య మోహినీపురంలో దాదాపు రూ.4లక్షల ఖర్చుతో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి దేవాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. గురువారం వేదపండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య స్వామివారికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం, ఆకు పూజ, కుంకుమార్చన పూజలు చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ సింగిల్ విండో అధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, గురెడ్డి భీమిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, సర్పంచ్ బెస్త ఆంజనేయ, మాజీ సర్పంచ్ అల్లింగప్ప, ఎంపీటీసీ రామాంజనేయులు, వైస్ సర్పంచ్ వీరనాగుళ్లకు ఆలయ నిర్వాహకులు ఉరుకుందు, నాగేంద్రలు శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిక్కస్వామి, చంద్ర, గురు, కుమార స్వామి, శేఖర్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.


మంత్రాలయం: ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు


ఎమ్మిగనూరు పట్టణంలో స్వామివారి అలంకరణ

మంత్రాలయం పుణ్యక్షేత్రం సమీపంలో వెలసిన కొండాపురం ఆంజనేయస్వామిని పల్లకిలో ఘనంగా ఊరేగించారు. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గంగ పుత్రుల సంఘం అధ్యక్షులు శాంతయ్య, శివ, అండే హనుమంతు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి విశేష పూజలు, అలంకరణ చేసి పల్లకిలో ఏర్పాటు చేసి రాఘవేంద్రసర్కిల్, పాత ఆంజనేయస్వామి గుడి వరకు ఊరేగింపు చేపట్టారు.

● గోనెగండ్లలో

మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. గోనెగండ్లలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో స్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామివారికి వెండి అలంకర ణ చేశారు. సింధూర పూజ, ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు చేశారు, ఆంజనేయ స్వామి దేవాయలంలో తిరుమల తిరుపతి దేవాస్థానం హిందు ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు మల్లువెంకటరెడ్డి, తులసమ్మ ఆధ్వర్యంలో ధార్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. హనుమాన్ చాలీసాను పఠించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ నాయకులు సత్యనారాయణ, మునిస్వామి, శ్రీరాములుయాదవ్, సుబ్రమణేశ్వరావు, శివశంకర్, కోటయ్య, మునెప్ప, గజేంద్ర, శ్రీను. రంగన్న, గోవిందు, కౌలుట్లయ్యనాయుడు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. పెదనెలటూరు గ్రామంలో జరిగిన వేడుకల్లో మాజీ సర్పంచ్ ఈరయ్యస్వామి, బసవస్వామి, శేషప్పనాయుడు, వీరన్నగౌడ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● కోసిగిలో

మండల కేంద్రమైన కోసిగితో పాటు అన్ని గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఆంజనేయస్వామి దేవాలయాలతో పాటు సీతారాముల దేవాలయాల్లో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కోసిగిలోని 3వ వార్డులో ఉన్న ఆంజనేయస్వామి (కోసిగయ్యస్వామి) దేవాలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.


గోనెగండ్ల: పెద్దనేలటూరు గ్రామంలో..

రేషన్ షాపుల్లోనే సరుకులు


మాట్లాడుతున్న తహసీల్దార్ రుద్రగౌడు

కోసిగి, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో రేషన్ ఎండీయూ వాహనాలను రద్దు చేశామని జూన్ 1 నుంచి డీలర్ షాపుల వద్దనే నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని కోసిగి తహసీల్దార్ రుద్రగౌడు అన్నారు. గురువారం కోసిగి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు నిత్యావసర సరుకులు రేషన్ దుకాణాల్లోనే పంపిణీ చేస్తామని తెలిపారు. రేషన్ దుకాణాల్లో ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. జూన్ 1న రేషన్ డీలర్లు రేషన్ దుకాణాల్లో పండుగ వాతావరణంలో రేషన్ సరుకులు లబ్దిదారులకు పంపిణీ చేయాలన్నారు. అలాగే ఎండీయూ ఆపరేటర్ల వద్ద ఉన్న ఈ-పోస్ మిషన్, రేషన్ సరుకులకు సంబధించిన రికార్డులను డీలర్లు వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ తిక్కస్వామి, ఆర్ఐ శ్రీరాములు ఉన్నారు.

●మంత్రాలయం

మండలంలో 36 రేషన్ దుకాణాల ద్వారా జూన్ 1 నుంచి లబిదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ ఎస్.రవి తెలిపారు. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ అందించే విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు జూన్ 1 నుంచి డీలర్ల వద్ద నుంచే సరుకులు పొందాలని కోరారు. 65 ఏళ్ల పైబడిన వృద్దులు, వికలాంగులకు జూన్ 1 నుంచి 5వ తేదీలోపు డీలర్లే వారి ఇంటికి వచ్చి సరుకులు అందజేస్తారని తెలిపారు. లబ్ధిదారులు, డీలర్లు ఈ మార్పులను గమనించి అవకతవకలకు పాల్పడకుండా ప్రతి లబ్దిదారు నికి రేషన్ అందించాలని కోరారు. ఇందుకు వీఆర్వోలు, వీఆర్ఏలు సహకరించాలని సూచించారు.

కర్ణాటక మద్యం సరఫరాపై ప్రత్యేక నిఘా


మాట్లాడుతున్న డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

మంత్రాలయం, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర- కర్ణాటక రాష్ట్రాల మధ్య ఏర్పాటుచేసిన మాధవరం చెక్‌పోస్టు ద్వారా కర్ణాటక మద్యం సరఫరా చేయకుండా అన్ని విధాలా నిఘా ఉంచాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఆఫ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో ఎక్సైజ్ కర్నూలు డిప్యూటీ కమిషనర్ పోతుల శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, ఎక్సైజ్ కర్నూలు సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, ఎమ్మిగనూరు ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి, మాధవరం చెక్‌పోస్టు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారికి గాయాలు

ఎమ్మిగనూరు రూరల్, మే22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఏడేళ్ల చిన్నారికి గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు బోడబండ గ్రామానికి చెందిన ఏడేళ్ల చిన్నారి విష్ణు రోడ్డు దాటుతుండగా ఎమ్మిగనూరు నుంచి ఆదోని వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్లింది. దీంతో విష్ణు నుదిటకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. దీన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేయడంతో చికిత్స నిమిత్తం హుటాహుటిన ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కర్నూలుకు రెఫర్ చేశారు. సంఘటనపై రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యోగాంధ్రకు సహకరించాలి

గోనెగండ్ల, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో మణిమంజరి, ఈవోఆర్‌డీ అనంతశయన అన్నారు. గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఎంపీడీవో సమావేశభవనం నందు మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర గా గుర్తించిందని అందుకు గాను ప్రతి గ్రామంలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అందుకు ఆయా గ్రామాల అధికారులు తమ వంతు కృషి చేయాలన్నారు. త్వరలో ప్రతి మండలం నుంచి ఇద్దరిఉద్యోగులను ఎంపిక చేసి వారికి యోగా గురించి ట్రైనింగ్ ఇస్తారని వారు మండలాలో ప్రతి గ్రామం నుంచి ఇందరిని ఎంపిక చేసి వారికి యోగా గురించి ట్రైనింగ్ ఇస్తారని వారు గ్రామం లోని ప్రజలచే యోగా కార్యక్రమం నిర్వహించాలని యోగా ద్వార జరిగే లాభాలు వివరించాలని తెలిపారు ఈ కార్యక్రమం అంతా జూన్ 21 లోపు పూర్తి చేయాలన్నారు. చివరిలో మంత్రాలయం 15వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మహమ్మద్‌బాషా, ఏపీఎం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలు


నవరత్నాల రథంపై విహరించిన ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మే 22 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య నవరత్నాల రథంపై ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు శోభిల్లారు. వైశాఖ దశమి, రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన గురువారం శుభదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు చేశారు. నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలను ఏర్పాటు చేసి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులతో మంత్రాలయం పురవీధులు కిక్కిరిసాయి.

చేనేత ఉత్పత్తుల పరిశీలన


చేనేతలు తయారు చేసిన వస్త్రాలు చూస్తున్న సబ్ కలెక్టర్

ఎమ్మిగనూరు టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం ప్రధాన కార్యాలయం ఆవరణలో చేనేత అధికారులతో, సొసైటీ మెంబర్స్‌తో సొసైటీ స్పెషల్ ఆఫీసర్, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సొసైటీ లోని ప్రొడక్షన్ సెంటర్, గోదాం, సెల్స్ సెంటర్ డైయింగ్ ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు రావు, సొసైటీ అసిస్టెంట్ డైరెక్టర్ అప్పాజి,డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహానాడుకు తెలుగు తమ్ముళ్లు


జెండా ఊపి వాహనాలను సాగనంపుతున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, మే22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన కర్నూలులో గురువారం జరిగిన జిల్లాస్థాయి మహానాడుకు ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు పట్టణం, ఎమ్మిగనూరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ఉదయం మినీ మహానాడుకు తరలి వెళ్లే వాహనాలను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి జెండా ఊపి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరులో జరిగిని మినీ మహానాడు విజయవంతం అయ్యిందని అదే తరహాలోనే జిల్లా కేంద్రంలో జరిగే మినీ మహానాడుకు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలి వెళ్లడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, ధర్మాపురం గోపాల్, బుగిడె నాగరాజు, కె.టి. వెంకటేశ్వర్లు, సురేష్‌చౌదరి, కురువ మల్లయ్య, రంగన్న, రఘు, కృష్ణ, వడ్డె కృష్ణ, కొండన్నగౌడు, నరసింహులు, పరమేష్, జగదీష్, రాఘవేంద్ర, చెన్నాపురం నాగరాజు, రఘు, హనుమంతు, షాలేమ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని డిప్యూటి తహసీల్దార్ వీరేంద్రగౌడ్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పెళ్లైన కొత్త జంటలు ఎలాంటి పెళ్లి సర్టిఫికెట్, ఫొటోలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పెళ్లైన ఆడ పిల్లలు అత్తవారి ఇంటి అడ్రస్‌తోనే రేషన్ కార్డు కొరకు దరఖాస్తును చేసుకోవచ్చని తెలిపారు. కొత్త రేషన్ కార్డు వచ్చిన తర్వాత పాత రేషన్ కార్డులో ఉన్న పేరును తొలగిస్తామన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణలో హోంగార్డుల విశేష కృషి

● రివార్డు అందజేసిన డీఎస్పీ

మంత్రాలయం, మే 22 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న ఖాజా మహబూబ్‌కు ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు రివార్డును అందజేశారు. మంత్రాలయంలో రాఘవేంద్ర సర్కిల్‌లో ట్రాఫిక్ నియంత్రణలో విశేష కృషి చేసిన హోంగార్డు ఖాజా మహబూబ్‌కు రివార్డును అందజేసి సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐలు శివాంజల్, విజయకుమార్, ఎమ్మిగనూరు, కోసిగి సీఐలు, పెద్దకడుబూరు ఎస్ఐలు కలిసి ఖాజా మహబూబ్‌ను అభినందించారు.

భూవివాదంలో ఘర్షణ

● ఇరువర్గాలపై కేసు నమోదు

కోసిగి, మే 22 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో భూ వివాదంలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. పరస్పర దాడిలో ఐదు మందికి తీవ్రమైన గాయాలు కాగా, ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నాగరాజు తెలిపారు. గురువారం మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో సర్వేనెంబర్.352-ఏ, బీలో 17.82 ఎకరాల పొలం విషయంపై ఇరువర్గాలు దాడులు చేసుకున్నారు . కందుకూరు గ్రామానికి చెందిన గుడ్ల హుశేనీ ఫిర్యాదు మేరకు దోసయ్యగారి అయ్యన్నతో పాటు 11 మందిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే దోసయ్యగారి అయ్యన్న ఫిర్యాదు మేరకు గుడ్ల హుశేనీతో పాటు మరో 11 మందిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన ఐదు మందికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు.వంశ వృక్షం గుడ్ల తిప్పయ్య చెందిన పొలం విషయంపై ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడినట్లు ఏఎస్ఐ నాగరాజు తెలిపారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె


కొనసాగుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ సమ్మె

ఎమ్మిగనూరు టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వేతనాలు, న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు..రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు 16వ రోజు సమ్మె కొనసాగించారు. కార్యక్రమంలో రాజేంద్ర, నరసప్ప ,విజయ్‌కుమార్, శ్రీరాములు, పంపాపతి, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల, మే 22(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ అన్నారు. కులుమాల గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రజలతో పోలీసు చట్టాలు, కోర్టు న్యాయం పట్ల అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా గ్రామ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఐ మాట్లాడుతూ ఎవైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని గ్రామాలస్థులకు సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు అడ్రస్ గోప్యంగా ఉంచుతామన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్రవాహనాలలో ప్రయాణించే సమయంలో తప్పక రోడ్డు జాగ్రత్తలను పాటించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.